

అరటి గెల @ రూ.500

రాజంపేట డివిజన్ ఉద్యానవన పంటలకు పెట్టింది పేరు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం అరటి ధరలు ఆకాశాన్నంటడంతో సంబంధిత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ డివిజన్‌లో సుమారు 20 వేల ఎకరాల్లో అరటి పంట సాగవుతోంది. ప్రస్తుతం రికార్డుస్థాయిలో అరటి కిలో ఏకంగా రూ.20, గెల రూ.500 పలుకుతోంది. ఇది చాలా అరుదైన అంశమనే చెప్పవచ్చు. ఇందుకు కారణం ప్రస్తుత సీజన్‌లో అరటిపంట దిగుబడి తక్కువగా ఉండడం, డిమాండ్‌కు తగ్గ కాయలు లేకపోవడమే. గతంలో రూ.10-12కు ఎప్పుడూ మించలేదు. ధరలు అధికంగా ఉండడం.. ఎకరాకు రూ.3 లక్షలకు పైగా ఆదాయం వస్తుండడంతో రైతులు ఆనందంలో మునిగిపోతున్నారు.

- అరటికి రికార్డు ధర
- గిట్టుబాటు ధరలతో రైతుల్లో ఆనందం



రాజంపేట మండలం బ్రాహ్మణపల్లె వద్ద పండిన అరటి పంట



రాజంపేట మండలం బ్రాహ్మణపల్లెలో సాగుచేస్తున్న అరటి పంట

రాజంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజంపేట డివిజన్‌లోని కోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, ఒంటిమిట్ట మండలాల్లో అరటి పంటకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ డివిజన్‌లో సుమారు 20 వేల ఎకరాల్లో అరటి పంట సాగవుతోంది. ప్రతి ఎకరాకు వెయ్యి అరటి చెట్లు పండుతాయి. ఒక్కో చెట్టు 20 నుంచి 30 కిలోలు బరువు ఉండే అరటిగెలను ఇస్తుంది. ప్రస్తుత రేట్ల ప్రకారం ఒక్కో గెల రూ.400 నుంచి 600 పలుకుతుంది. సరాసరి లెక్కించుకుంటే గెలకు రూ.500 వచ్చినా ఎకరాకు రూ.5 లక్షలు ఆదాయం వస్తోంది. అన్‌సీజన్‌లో రూ.3 లక్షల ఆదాయం వస్తోంది. సరాసరిన లెక్కిస్తే అరటి గెలలు అనేకదశల్లో కోతకు వస్తాయి. ఈ ప్రకారం లెక్కించుకుంటే ఒక ఎకరాకు ఎంత తక్కువ అనుకున్నా ఖర్చులు పోనూ రూ.లక్ష నుంచి రెండు లక్షల ఆదాయం వస్తోంది. ప్రస్తుతం 20 వేల ఎకరాల్లో అరటి వివిధ దశల్లో సాగై ఉంది. అనేకచోట్ల ఇప్పుడిప్పుడే అరటి పిలకలు నాటారు. మరికొన్నిచోట్ల కోత దశకు వచ్చి ఉన్నాయి. తక్కువ చోట్ల గెలలు పండాయి. ఆ గెలలను ఎగుమతి చేసుకుంటే మంచి ధర వస్తుంది.

భారీ ఎత్తున అరటిసాగు

రాజంపేట, రైల్వేకోడూరుల్లోని శెట్టిగుంట, ఉప్పరపల్లె, మైసూరువారిపల్లె, జంగిటివారిపల్లె, కం ద్రిక, చెన్నరాజుపోడు, గాదెల, వెంకట్రాపురం, బి.కమ్మపల్లె, నగిరిపాడు, నాగవరం, బెస్తపల్లె, నల్లపురెడ్డిపల్లె, అనంతయ్యగారిపల్లె, అనంతసముద్రం, మిట్టమీదపల్లె, మేకావారిపల్లె, కొల్లావారిపల్లె, బ్రాహ్మణపల్లె, కూచివారిపల్లె, ఆకేపాడు, చెర్లోపల్లె, హస్తవరం, కారంపల్లె తదితర ప్రాంతాల్లో భారీఎత్తున ఈ అరటి పంటను సాగు చేస్తారు. ఏడాదిలో ప్రతి నిత్యం ఈ అరటి ఎగుమతి అవుతూనే ఉంటుంది. ఈ అరటి పంటను ఇంటిల్లిపాది కష్టపడి...

మిగతా 6వ పేజీలో..

కూలిపోయిన అభయాంజనేయస్వామి ఆలయం



నెల రోజులుగా కుట్ర

- పది రోజులు కాపుకాచిన నిందితులు
- రెండు రోజుల క్రితం జిలెటిన్ స్టిక్స్‌తో పేల్చేందుకు యత్నం
- 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు
- పోలీసుల విచారణలో పలు విషయాలు వెలుగులోకి..

నిందితులకు రిమాండ్

ములకలచెరువు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు సమీపంలోని కనుగొండ అటవీ ప్రాంతంలో వెలసిన అభయాంజనేయస్వామి ఆలయం కూల్చివేతకు నెల రోజుల నుంచి పథకం రచించి పేల్చేందుకు కుట్ర పన్నారు. పది రోజుల నుంచి రాత్రి వేళల్లో కాపు కాచారు. రెండు రోజుల క్రితం ఆలయం పేల్చేందుకు జిలెటిన్ స్టిక్స్ తెచ్చి గోడలకు చుట్టూ రంధ్రాలు పెట్టారు. రెండు జిలెటిన్ స్టిక్స్‌ను రంధ్రాల్లో అమర్చారు. అవి పేలకపోవడంతో సుత్తి, గడ్డపారలతో కొట్టి నేలమట్టం చేశారు. ఈ విషయాలన్నీ పోలీసుల విచారణ వెలుగులోకి వచ్చాయి. నేలమట్టమైన అభయాంజనేయస్వా మి ఆలయానికి కొంత దూరంలో ఉన్న కనుగొండరాయస్వామి ఆలయ పూజారి హరినాథ్ ఈ తతంగం నడిపారు. ఆలయాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని చేసిన ప్రయత్నాలు విఫలం చెందడంతో ఈ దారుణానికి పాల్పడ్డాడు. ఆలయాన్ని ఈనెల 14వ తేదీన కూల్చేశారు. ఈనెల 15న వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు సీఐ రాజారమేష్ కేసును నమోదు చేసి పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. 24 గంటల్లో ప్రధాన నిందితుడు పూజారి హరినాథ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఈ దారుణానికి పాల్పడ్డ ఐదురుగు నిందితులను పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం 6 మంది నిందితులను శరవేగంగా అరెస్టు చేశారు. అలాగే ఆలయం పేల్చేందుకు తెచ్చుకున్న జిలెటిన్ స్టిక్స్‌ను, సుత్తి, గడ్డపారలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఆరుగురు నిందితులను అరెస్టు చూపారు. ఆరుగురు నిందితులను శుక్రవారం తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరచగా జడ్జి వచ్చే నెల 1వతేది వరకు రిమాండ్‌కు ఆదేశించారు. కాగా నిందితులకు జిలెటిన్ స్టిక్స్ అమ్మిన సత్యసాయి జిల్లాకు చెందిన వ్యక్తిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. గుప్తనిధుల కోసమైతే దుండగులు ఆలయాల్లో తవ్వకాలు మాత్రమే చేసేవారు. దొంగలు హుండీలు ఎత్తుకుపోయిన ఘటనలు జరిగాయి. ఏకంగా ఆలయాన్ని కూల్చిన ఘటన చోటు చేసుకోలేదు.

శభాష్... రాజారమేష్

రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా సంచలనంగా మారిన అభయాంజనేయస్వామి ఆలయం కూల్చివేసిన ఘటనను కేవలం 24 గంటల్లో ఛేదించి నిందితులను పట్టుకున్న ములకలచెరువు సీఐ రాజారమేష్‌ను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు. ఈ ఘటనను ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకుంది. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఘటనను సీరియస్‌గా తీసుకుని నిందితులను త్వరగా పట్టుకోవాలని పోలీసుశాఖను ఆదేశించారు. దీనిపై ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సూచనల మేరకు సీఐ రాజారమేష్ కేసును త్వరితగతిన ఛేదించి నిందితుల్ని పట్టుకున్నారు. ఈ ఘటన పూజారుల మధ్య తలెత్తిన వివాదంతోనే జరిగిందని వెల్లడి కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఇసుక, మద్యంలో వేలు పెట్టొద్దు

- జిల్లా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో ముఖ్యమంత్రి

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఇసుక, మద్యం వ్యాపారంలో టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు వేలు పెట్టవద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖా మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వలే ఇసుక సరఫరాలో జోక్యం చేసుకోవద్దని సూచించారు. అదే విధంగా మద్యం వ్యాపారంలో కూడా ఎవరూ జోక్యం చేసుకుని వ్యక్తిగతంగా చెడ్డపేరుతో పాటు.. పార్టీకి కూడా చెడ్డ పేరు తీసుకురావద్దని హెచ్చరించారు. త్వరలో చేపట్టబోయే పార్టీ సభ్యత్వ నమోదును పెద్దఎత్తున చేయాలని సూచించారు.







విజయవాడలో చంద్రబాబు నిర్వహించిన శాసన సభాపక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు

బాలరాజుపల్లె ఇసుకరీచ్ బంద్



చెయ్యేటికి వరదనీరు రావడంతో బాలరాజుపల్లె ఇసుక రీచ్ వద్ద నిలిచిపోయిన లారీలు

రాజంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా అంతటికి ప్రస్తుతం ఉన్న ఏకైక బాలరాజుపల్లె ఇసుకరీచ్ వరదనీటికి బంద్ అయింది. ఎగువ ప్రాంతాల్లో వర్షం కురవడంతో వరదనీరు రాజం పేట మండలం బాలరాజుపల్లె వద్దకు చేరింది. తద్వారా ఇసుకరీచ్‌కు వెళ్లేమార్గం తెగిపోవడంతో ఇసుక రవాణా నిలిచిపోయింది. ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుని ఇసుక రీచ్‌నుంచి తీసుకెళ్లాల్సిన లారీలన్నీ అర్థాంతరంగా వెనుదిరిగాయి. దీంతో ఈ వర్షాకాలంలో జనవరి వరకు ఈ ఇసుక రీచ్‌లోకి వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. అదేవిధంగా కొత్తగా నారాయణనెల్లూరు, కోమంతరాజపురం ఇసుక రీచ్‌లకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఆ ఇసుక రీచ్‌లకు కూడా వరదనీరు చేరి ఉండడంతో ఇవి రెండూ ఆరంభ సూత్రంగానే మిగలనున్నాయి. దీనివల్ల ఇప్పుడే ఇసుక సమస్య తీరే అవకాశాలు కానరావడం లేదు. జనవరి వరకు ఇసుక దొరికే అవకాశాలు లేనందున గృహనిర్మాణదారులు ఇంటి నిర్మాణాలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది.

అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



రాయచోటిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అమరవీరులైన పోలీసుల సేవలను గుర్తుంచుకుంటామని, వారి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు కుటుంబ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు సిబ్బంది సంక్షేమ కోసం జిల్లా పోలీసుశాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందాల్సిన సౌకర్యాలు (బెనిఫిట్స్), కుటుంబ స్థితిగతులు, బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి విన్నవించుకోవచ్చని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చిన్నిక్రిష్ణ, ఏవో బి.కృష్ణుడు, ఆర్ఐలు (అడ్మిన్), వీ.జే.రామకృష్ణ, ఎంటీవో పెద్దయ్య, డీపీవో ఏటూ క్లర్క్ సునీల్, విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించండి

సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించాలని, పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు సిబ్బందికి, హోంగార్డులకు సూచించారు. శుక్రవారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు, హోంగార్డ్సు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు, హోంగార్డు సిబ్బంది, వ్యక్తిగత, చిల్డ్రన్స్, మెడికల్ సమస్యల గురించి ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. ఎస్పీ సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు, తగిన పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు.

చెక్కభజనలో రాజా



చెక్కభజన ప్రదర్శన ఇస్తున్న డిస్కో రాజా (ఫైల్)

పోరుమామిళ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చెక్కభజన (కులుకుభజన) అంటే అతనికి ఆరోప్రాణం. ఎక్కడ ఉత్సవాలు జరిగినా, పండుగలు జరిగినా దేవాలయ విగ్రహ ప్రతిష్ఠలు జరిగినా తనదైన శైలిలో కులుకుభజనతో ఆ ప్రాంతవాసులను మంత్రముగ్ధులను చేస్తుంటాడు. మండలవాసులనే కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా తన కళను ప్రదర్శిస్తూ ఎంతో మందికి చెక్క భజనలో శిక్షణ ఇస్తూ రాణిస్తున్నాడు పోరుమామిళ్ల మండలం పుల్లీడు పంచాయతీ పేరమ్మగారిపల్లెకు చెందిన డిస్కోరాజా.

డిస్కోరాజా అంటే జిల్లాలో తెలియనివారు ఉండరు. అయితే ఈయన అసలు పేరు బండ్ల రాజా. ఈయన తల్లిదండ్రులు బాలమ్మ, సుబ్బయ్య. సుబ్బయ్య పండరిభజన కళాకారుడు. రాజా అన్న సుబ్బరాయుడు కూడా పండరిభజన కళాకారుడు. అయితే రాజా ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో వీరి గ్రామంలో బి.మఠానికి చెందిన పుల్లయ్య చెక్కభజన ప్రదర్శించాడు. దానిని చూసినప్పటి నుంచి రాజాకు చెక్కభజనపై ఆసక్తి పెరిగింది. పుల్లయ్య వద్ద తమ గ్రామంలోని మరికొందరు యువకులతో కలసి చెక్కభజన నేర్చుకున్నాడు. తొలిసారిగా తమ కాలేజీలోనే ప్రదర్శన ఇచ్చాడు. ఇక అప్పటి నుంచి వెనుదిరిగి చూడలేదు. ఉన్న ఎకరం పొలంలో సేద్యం చేసుకుంటూ.. చెక్కభజనే వృత్తిగా జీవనం సాగిస్తున్నాడు.

36 ఏళ్లుగా..

బండ్ల రాజా మారుతున్న ప్రజల అభిరుచులకు అనుగుణంగా చెక్కభజన ప్రదర్శించడం మొదలు పెట్టాడు. ఇందులో భాగంగా సినిమా పాటలకు భజన చేయడం, ఆ పాటలకు అనుగుణంగా సినిమాల్లో మాదిరి డ్యాన్సులు కూడా చేయడం మొదలు పెట్టాడు. చెక్కభజనతో పాటు కులుకుభజనలోనూ ప్రావీణ్యం సాధించాడు. దీంతో ఈయన పేరు డిస్కోరాజాగా మారింది. తాను నేర్చుకున్న విద్యను మరింత పదను పెట్టి గ్రూపులుగా తయారు చేసుకుని ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించాడు. దాదాపు 36 ఏళ్ల నుంచి ఈ కళనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. 30 నుంచి 50 మందితో బృందాన్ని తయారు చేసుకుని వివిధ ప్రాంతాల్లో దాదాపు 70 గ్రూపులకు పైగా శిక్షణ ఇచ్చారు.

ఎన్నో ప్రదర్శనలు..

డిస్కో రాజా ప్రదర్శనలు పోరుమామిళ్ల మండలానికే పరిమితం కాలేదు.. జిల్లాతో పాటు కేర్నూలు జిల్లాలోనూ ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. తిరుణాల, పండుగ, వివాహ వేడుకలు, అయ్యప్పస్వామి ఊరేగింపులు, దేవాలయాలు, చర్చిల ఉత్సవాలకు చెక్కభజన నిర్వహిస్తుంటారు. ఎన్నికల సందర్భాల్లో కూడా తన కళ ప్రదర్శించారు. ప్రభుత్వపథకాల్లో భాగంగా అక్షర రశ్మి, మద్యపాన నిషేధం, కడపోత్సవాల్లో పాల్గొని చెక్కభజన ద్వారా ప్రజలకు సందేశమిచ్చారు. బ్రహ్మంగారిమఠం, సిద్ధయ్యమఠం, నర్రవాడ వెంగమాంబ ఉత్సవాల్లో, క్రిష్ణంపల్లె జమలయ్య ఉర్సు సందర్భంగా సన్మానాలు అందుకున్నారు. గతంలో రాజంపేటలో జరిగిన అన్నమయ్య ఉత్సవాల్లో వంద మంది చేత చెక్కభజన చేసి అందరి మన్ననలు పొందారు.

చెక్కభజనలో మార్పులు

గతంలో చెక్కభజనలో ప్రజలు పౌరాణిక పాటలు ఆదరించేవారు. అవే కోరుకునేవారు ఇప్పటి తరం సినిమాల్లోలాగా డిస్కో డ్యాన్స్‌లు కోరుకోవడంతో వారి అభిరుచులకు తగ్గట్లు పాటలు పాడుతూ చెక్కభజన చేస్తున్నారు. గతంలో ప్రోగ్రాంలో పాల్గొంటే బృందానికి రూ.50వేలు ఇచ్చేవారు. ప్రస్తుతం రూ.80వేలు ఇస్తున్నా చివరకి తన చేతికి అందేది రూ.2వేలు, 3వేలు మాత్రమే అని డిస్కో రాజా అంటున్నారు. చెక్కభజన సందర్భంగా మైకు టెస్టింగ్‌లకు రూ.20వేలు, డ్యాన్సర్లకు రూ.14వేలు ఇవ్వాల్సి వస్తుందన్నారు. ప్రత్యేకంగా ఉండేందుకు అనంతపురం, నంద్యాల, కర్నూలు, గుత్తి నుంచి చెక్కభజన కార్యక్రమానికి డ్యాన్సర్లను పిలిపించుకోవాల్సి వస్తుందన్నారు. గతంలో నెలకు 3 కార్యక్రమాలు ఉండేవని, కోలాటం వచ్చిన తరువాత తమకు గిరాకీ తగ్గిందన్నారు. వినాయకచవితి, ఉగాది వంటి ఉత్సవాలకు కూడా ప్రోగ్రాంలు ఇచ్చామన్నారు.

కళాకారుల పింఛన్ ఇవ్వాలి

- డిస్కోరాజా, చెక్కభజన (కులుకుభజన) కళాకారుడు



కళాకారునిగా అందరి మన్ననలు, గుర్తింపు పొందినా నాకు కళాకారుల పింఛన్‌మాత్రం రావడం లేదు. కొన్ని జిల్లాల్లో చెక్కభజన కళాకారులకు పింఛన్ అందుతోంది. ఈ జిల్లాలో కళాకారులకు పింఛను అందడంలేదు. మా కళను ప్రభుత్వం గుర్తించి మాలాంటి వారికి పింఛను ఇచ్చి ఆదుకోవాలి. ఉన్న ఒక ఎకరా పొలంతోనే జీవనం సాగిస్తున్నా. పంటలు సరిగా చేతికి రాకపోతే అప్పులు చేయాల్సిందే. నేను 36 ఏళ్లుగా ఈ కళనే నమ్ముకుని ఉన్నా. ఇప్పటికైనా ప్రభుత్వం కళాకారుల పింఛను కేటాయించి ఆదుకోవాలి.

అరటి గెల @ రూ.500



రాజంపేట మండలం కారంపల్లెలో ఉన్న అరటి పంట

- అరటికి రికార్డు ధర
- కిలో రూ.20.. గెల రూ.500
- గిట్టుబాటు ధరలతో రైతుల్లో ఆనందం

(5వ పేజీ తరువాయి..)

సాగు చేయడం.. వచ్చిన లాభాలతో కుటుంబ పోషణ చేసుకోవడం ఈ ప్రాంత ఉద్యానవన రైతులకు ఓ ప్రధాన వనరుగా మారింది. ఎక్కువగా ఈ పంటను బోరుబావుల కిందనే సాగు చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

రాష్ట్రంలోని అనేక పట్టణాలతో పాటు చెన్నై, ముంబై, బెంగుళూరు తదితర రాష్ట్రాలకు కూడా రాజంపేట డివిజన్ నుంచి అరటికాయలను ఎగుమతి చేస్తుంటారు. ప్రతిరోజు ఈ ప్రాంతం నుంచి 20 లారీలకు తక్కువ లేకుండా ఎగుమతి అవుతూ ఉంటాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూలీలు పండిన అరటి తోటల వద్దకు వెళ్లి వాటిని కట్‌చేసి ఒకచోట పోగు చేస్తారు. మధ్యాహ్నానికి ప్రత్యేక లారీల్లో వీటిని ఎంతో జాగ్రత్తగా అమర్చి సాయత్రం వేళ ప్రధాన పట్టణాలకు తీసుకెళతారు.

నదీ పరివాహక ప్రాంతాలైన పెన్నానది, బాహుదానది, చెయ్యేరు, గుంజనేర్ల కింద నీరు సమపాలల్లో లభించే బోరుబావుల కిందనే ఈ పంటను సాగు చేస్తున్నారు. ఏదేమైనా గతేడాది ఇదే సీజన్‌లో కిలో అరటి ధర కేవలం రూ.10 ఉండింది. ఈ ఏడాది అమాంతంగా రూ.20కు చేరడంతో అరటి రైతుల్లో ఆనందాన్ని ఇస్తుంది. 2 నెలల కిందట కిలో అరటి ధర కేవలం రూ.10-12 మధ్య ఉండేది. దీనివల్ల తక్కువ ఆదాయం వచ్చేది. ఏడాది పొడవునా పంట దిగుబడిని ఇచ్చే అరటిపంట ఈ ప్రాంత ఉద్యానవన రైతులకు పెద్దవరంగా మారింది.

రూ.20 ధర ఉండడం ఆనందదాయకం

- నాగా హరి, రైతు, అనంతయ్యగారిపల్లె, పుల్లంపేట



మాది పుల్లంపేట మండలం అనంతయ్యగారిపల్లె, మేము 10 ఎకరాల్లో అరటి పంటను సాగు చేస్తున్నాం. ప్రస్తుత సీజన్‌లో అరటి కిలో రూ.20 పలకడం ఆనందదాయకం. అయితే ప్రస్తుత సమయంలో అరటికాయలు తక్కువగా ఉండడంతో ధరలు అమాంతం పెరిగాయి. ఇటీవలే అరటి పంట చేతికి రావడం వల్ల వాటిని ఎగుమతి చేశాం. అక్కడక్కడ చేతికి వచ్చిన అరటి పంట వల్ల సంబంధిత రైతులు లాభాలు గడిస్తూ ఆనందపడుతున్నారు. ఇది అరటి పంట రైతులకు శుభపరిణామం.

కాయలు తక్కువగా ఉన్నప్పుడు ధరలు మామూలే

- ఎ.శంకరయ్య, రైతు, గొబ్బూరువారిపల్లె, ఓబులవారిపల్లె



మార్కెట్‌లో కాయలు లేనప్పుడు అతి తక్కువగా లభించే పంటకు వ్యాపారులు ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం అరటి పంట సీజన్ అయిపోయింది. అక్కడక్కడ అరకొరగా కాయలు దిగుబడి అవుతున్నాయి. ఈ అరటికాయలను చెన్నై, గూడూరు, బెంగుళూరు ప్రాంతాలకు ఎగుమతి చేసినప్పుడు వీటికి బాగా డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం కిలో రూ.20 ఉండడం వల్ల పంట చేతికొచ్చిన కొద్దిపాటి అరటి రైతులకు బాగా గిట్టుబాటు లభిస్తుంది.

జాతీయస్థాయి గణితంలో విద్యార్థిని ప్రతిభ



నిమ్మనపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లి మోడల్‌స్కూల్‌లో 10వ తరగతి చదుతున్న విద్యార్థిని శ్రీహాసిని 2024 జాతీయస్థాయి (ఏజీఎమ్ఎన్‌సీ) ఆల్ ఇండియా గర్ల్స్ మ్యాస్ న్యూటర్ క్యాంప్ అనే ఆన్‌లైన్ నేషనల్ పరీక్షకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థిని జాతీయ స్థాయిలో గణితంలో ముందంజలో రావడంతో వారం రోజుల పాటు బెంగళూరులో ఉచితంగా గణితంపై శిక్షణ ఇవ్వడంతో పాటు మూడు నెలల పాటు ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తారని తెలిపారు. మోడల్ స్కూల్ నుంచి శ్రీహాసిని ఎంపిక కావడంపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 470 రెవెన్యూ గ్రామాలకు గానూ ఇప్పటి వరకు 138 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించిందని, ఈ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ గ్రామ సభలు ఈ నెల 18 నుంచి ప్రారంభమై 30 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభల్లో స్వీకరించిన అర్జీలను అధికారులు నిర్ణీత గడువు లోపల పరిష్కరించాలని సూచించారు.

అన్ని సౌకర్యాలతో పనులు చేపట్టండి



గోదామును పరిశీలిస్తున్న జేసీ

తంబళ్లపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మండల స్థాయి సివిల్ సప్లయ్స్ గోదామును అన్ని సౌకర్యాలతో నాణ్యతగా చేపట్టాలని జేసీ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శుక్రవారం తంబళ్లపల్లెలో రూ.69 లక్షల అంచనాతో నిర్మిస్తున్న సివిల్ సప్లయ్స్ గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ డీఎం శివరాం, తహసీల్దారు హరికుమార్, ఆర్ఐ, వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితులకు పదిహేను నెలలు జైలు శిక్ష

గుర్రంకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరు నిందితులకు పదిహేను నెలలు జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ మదురామచంద్రుడు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని సరిమడుగు పంచాయతీ క్రిష్టాపురానికి చెందిన రమేష్ ద్విచక్ర వాహనాన్ని గత ఏడాది జూన్ 27వ తేదీన చోరీ చేశారు. అప్పట్లో కేసులో నిందితులైన ప్రకాశ్(20), సుబ్బారెడ్డి(31)లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. ఈ కేసులో వాదోపవాదనలు విన్న వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు శుక్రవారం ఇద్దరి నిందితులకు సంవత్సరం మూడు నెలలు జైలు శిక్ష, రూ.1000 జరిమానాను విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

కలకడలో: అలాగే కలకడ మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ మంగళ పల్లెలోని ఓ ఆర్ఎంపీ డాక్టర్ ఇంటి వద్ద ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గత ఏడాది డిసెంబరు 23వ తేదీన చోరీ కేసులో ఇద్దరి నిందితులకు సంవత్సరం మూడు నెలలు జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఈ కేసులో నిందితులైన ప్రకాశ్(20), సుబ్బారెడ్డి(31)లను పోలీసులు పట్టుకున్ని రిమాండు పంపారు. ఈ క్రమంలో వాల్మీకీపురం జూనియర్ సివిల్ కోర్టు నిందితులకు శుక్రవారం సంవత్సరం మూడు నెలలు జైలు శిక్ష, రూ.1000 జరిమానాను విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

రామసముద్రం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. రామసముద్రం-పుంగనూరు రోడ్డులో ఎదురెదురుగా వేగంగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రామసముద్రం మండల కేంద్రానికి చెందిన గంగరాజు అనే వ్యక్తి కాలికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. గంగరాజును స్థానికులు 108 వాహనం ద్వారా పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బోరు బావి తగాదాలో అన్నపై తమ్ముడి దాడి



ఆసుపత్రిలో బాధితుడు పెద్దరెడ్డెప్ప వద్ద నుంచి ఫిర్యాదు తీసుకుంటున్న ఏఎస్ఐ మధుసూదనాచారి

కలికిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బోరు బావిలో అన్నకు భాగం లేదంటూ తమ్ముడు దాడి జరిపిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లూరు పంచాయతీ గల్లావారి పల్లె గ్రామానికి చెందిన జి.పెద్ద రెడ్డెప్ప శుక్రవారం ఉదయం తమ ఉమ్మడి భూమిలోని బోరు వద్దకు వెళ్ళాడు. ఆయన తమ్ముడు చిన్న రెడ్డెప్ప బోరులో ఆయనకు భాగం లేదని వాదనకు దిగాడు. వాదులాట పెరగడంతో తమ్ముడు చిన్న రెడ్డెప్ప కట్టె తీసుకుని అన్న ఎడమ చేయి, ఎడమ కాలుపై కొట్టి గాయపరిచాడు. బాధితుని అరుపులు విన్న చుట్టు పక్కల వారు వచ్చి తమ్ముని బారి నుంచి అన్నను విడిపించారు. కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం అన్న పెద్ద రెడ్డెప్ప పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశాడు. పోలీసు ఇన్‌స్పెక్టర్ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏఎస్ఐ మధుసూదనాచారి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ 78 మంది వీఆర్వోల బదిలీలతో కొత్త జాబితా

కలికిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరో 78 మంది వీఆర్వోలను బదిలీ చేస్తూ శుక్రవారం కొత్త జాబితా విడుదలైంది. అయితే గత నెల 22వ తేదీతో (బదిలీలపై 22 తరువాత నిషేధం వర్తిస్తుంది) ఈ జాబితా రావడం రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా ఉంది. ఇందులో దాదాపు 90 శాతం మంది గతంలో బదిలీ అయిన వారే ఉన్నారు. ఇలా బదిలీ అయిన వారిని తిరిగి వేర్వేరు మండలాలకు, గ్రామాలకు బదిలీ చేస్తూ ప్రస్తుత ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయినా నిషేధం సడలింపు గడువు పూర్తయి దాదాపు నెల రోజులు కావస్తున్నా పాత తేదీతో జాబితాలను ప్రకటించడం విడ్డూరంగా ఉందంటున్నారు. దీనికి తోడు గతంలో బదిలీ అయిన వారినే ఇప్పటికీ రిలీవ్ చేయకుండా ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలనలో నిమగ్నం చేశారు. ఇది పూర్తయితే గానీ బదిలీలకు గురైన వీఆర్వోలు రిలీవ్ అయ్యే అవకాశాలు మాత్రం లేవని చెబుతున్నారు.

గతంలోని రెండు జాబితాలు ఇప్పటికే త్రిశంకు స్వర్గంలో ఉండగా తాజాగా శుక్రవారం మూడో జాబితా రావడం గందరగోళానికి దారి తీసిందని చెబుతున్నారు.

ఆర్టీసీ బస్సు-ద్విచక్ర వాహనం ఢీ

- ఇద్దరు విద్యార్థులు మృతి



మృతిచెందిన యశ్వంత్‌కుమార్‌రెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి

కురబలకోట, అక్టోబరు 18: ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తంబళ్ళపల్లె మండలం గుండ్లపల్లె పంచాయతీ మలిగివారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి కుమారుడు యశ్వంత్‌కుమార్‌రెడ్డి(20), చెట్లవారిపల్లెకు చెందిన సుబ్బారెడ్డి కుమారుడు అజయ్‌కుమార్‌రెడ్డి(20)లు మదనపల్లె పట్టణంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. వారు ఉదయం కళాశాలకు వెళ్లి తిరిగి సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలోని దాదాంవారిపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందారు. కాగా ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పునుగుపల్లె

ఏం పాపం చేసింది..!

- మూడేళ్లుగా ఉపాధి పనులు లేవు..
- ఉపాధి లేక కూలీల అవస్థలు
- రాజకీయం చేస్తున్నారని కూలీల ఆవేదన



వాల్మీకిపురం సమీపంలోని పునుగుపల్లె గ్రామం

వాల్మీకిపురం, అక్టోబరు 18: వాల్మీకిపురం గ్రామ పంచాయతీలో అది కూడా అత్యంత సమీపంలో జాతీయ రహదారి పక్కగానే పునుగుపల్లె అనే గ్రామం ఉంది. అక్కడ వంద ఇళ్లకు పైగా నివాసాలు ఉంటుండగా అందులో సుమారు వందమంది కూలీలు జీవనంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. కనీసం గ్రామంలో వ్యవసాయం కూడా లేక పాపానపోలేదు. దీంతో చేసేదేమీలేక కూలీలంతా బయటి పనులకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉపాధి అధికారులను మూడేళ్లుగా ప్రాధేయపడుతున్నా పనులు కల్పించడం లేదని, ఎందుకని ప్రశ్నిస్తే మీ గ్రామానికి ఏ పనులు లేవని ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని కూలీలు విచారం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఉపాధి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగితే ఉపాధి పనులకు కూడా రాజకీయ నాయకుల దగ్గరికి వెళ్లాలని చెప్పడంతో పూర్తిగా పనులపై ఆశలు వదులుకున్నామన్నారు. మీ గ్రామానికి ఎలాంటి పనులు లేవని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మూడు సంవత్సరాలుగా



కంపచెట్లతో నిండిపోయిన పునుగుపల్లె కొత్తచెరువు

పునుగుపల్లెకు చెందిన కూలీలు

పునుగుపల్లెలో సగంలో నిలిపివేసిన ఇంకుడు గుంత పనులు

గ్రామంలో పనులు కూలి జీవనమే గత్యంతరం అయింది. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మూడేళ్లుగా పునుగుపల్లె దరిచేరడం లేదనే చెప్పాలి. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామానికి చెందిన కూలీలు ఒక్కరోజైనా ఉపాధి పనులు చేసిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో పనులు లేక బయటి ప్రాంతాలకు వ్యవసాయ పనులు, తాపి మేస్త్రీ, దినసరి కూలీ పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. పునుగుపల్లె గ్రామానికి ఉపాధి అధికారులు కానీ, సిబ్బంది కానీ వచ్చిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామ సమీపంలో కొత్త చెరువు ఒకటి ఉందని, సమీపానే ఉన్న కాలువ కూడా ముళ్ల పొదలు పెరిగిపోయి ఆనవాళ్లు కోల్పోతోందని, అధికారులు వచ్చి పరిశీలిస్తే తమకు కరువు పనులకు చింతే ఉండదని విన్నవించుకుంటున్నారు. మూడేళ్ల క్రితం పునుగుపల్లె సమీపంలో ఓ ఇంకుడు గుంత పనులు చేపట్టి అర్ధంతరంగా నిలిపివేసి కనీసం చేసిన పనులకు కూలీలు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు పునుగుపల్లెను సందర్శించి ఉపాధి పనులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


మూడేళ్లుగా పనులు లేవు..



మా పల్లెలో పోయిన మూడేళ్లుగా కరువు పనులు ఒకటి లేవు. అధికారులని అడిగితే మీ ఊరికి పనులు లేవంటున్నారు. నిరుపేదలు ఎలా బతకాలి.

-మణిరాజ, పునుగుపల్లె

పనులకు బయటకు పోతున్నాం...



మాపల్లెలో పనులు లేక బయటి కూలి పనులకు పోతున్నాం. మా పల్లె ఏం పాపం చేసింది. మాకు కరువు పనులు లేరు. అధికారులు ఎందుకు ఇలా చేస్తున్నారు.

-రుక్మిణమ్మ, పునుగుపల్లె, వాల్మీకిపురం.

రాజకీయం చేస్తారా...



గ్రామంలో కరువు పనులు పెట్టమని అడిగితే రాజకీయ నాయకుల దగ్గరికి పోమంటారు. కూలోళ్ల కరువు పనుల్లో కూడా రాజకీయం చేస్తారా.

-యశోద, కూలి, పునుగుపల్లె, వాల్మీకిపురం

పనులు పెట్టండి సారూ...



పునుగుపల్లెలో ఒకసారి అధికారులు వచ్చి చూస్తే తెలుస్తుంది. మేము పడే కష్టాలు. కరువు పనులు లేక బయటి రోజు కూలీలుగా పోతా ఉంటాము. మాకు కరువు పనులు చూపించాలి.

-ఈశ్వరమ్మ, కూలీ, పునుగుపల్లె

పరిశీలించి పనులు కల్పిస్తాం..

పునుగుపల్లెలో స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారిస్తాం. కూలీల సమస్యలు అడిగి తెలుసుకుంటాం. గ్రామంలో కూలీలందరికీ ఉపాధి పనుల కల్పన దిశగా చర్యలు తీసుకుంటాం. కూలీలు బయటి పనులకు వెళ్లకుండా కరువు పనులు కల్పిస్తాం.

-మనోహర్‌రాజు, ఎంపీడీవో

ట్రిపుల్ఐటీ కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా అనిల్



చక్రాయపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రిపుల్ఐటీ కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ బొజ్జా అనిల్‌కుమార్‌రెడ్డిని కాంటట్రాక్ట్ అధ్యాపకుల ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. అలాగే వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కోటీశ్వరరావు (ఒంగోలు), ప్రధాన కార్యదర్శి తేజ కిరణ్ (శ్రీకాకుళం), జాయింట్ సెక్రటరీ నిర్మల కుమారి(శ్రీకాకుళం), ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.శివకుమార్ (నూజివీడు)ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కారా నికి పోరాడతామన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులను శాశ్వత అధ్యాపకులుగా నియమించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. అప్పటి వరకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతామన్నారు.

ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతరకు ఆవుల వెంకట్‌కు ఆహ్వానం



వేంపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగుసాహితీ కళాజాతరకు వేంపల్లె జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్ -2లో పనిచేస్తున్న పీజీటి సివిక్స్ అధ్యాపకుడు ఆవుల వెంకట్‌కు ఆహ్వానం అందింది. అంతర్జాతీయ ప్రమాణాలు గల సాహిత్య సాంస్కృతిక, సామాజికసేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా తాడేపల్లె గూడెంలో ఈనెల 19, 20 తేదీల్లో ఏకధాటిగా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ ప్రపంచతెలుగు సాహితీ కళాజాతర కార్యక్రమానికి ఆవుల వెంకట్ పాల్గొననున్నారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తి మండప్రతాప్ ఆధ్వర్యంలో దాదాపు 500 మంది కవులు కళాకారులు, తమ సాహితీ ప్రక్రియలు ప్రదర్శించనున్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఏపీజెన్‌కో ఆర్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.సుబ్బిరెడ్డి మాట్లాడుతూ గ్రేడ్‌చేంజ్, పీఆర్‌సీ అరియర్స్, సర్వీస్ ఇన్సెంటివ్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు అనేకసార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. 2018లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వంద శాతం జీతాల పెంచడమే కాకుండా అరియర్స్‌తో కలిపి జీతాలిచ్చారన్నారు. విద్యుత్ సంస్థలు కార్మికులకు అరియర్స్ ఇవ్వకపోవడం వల్ల ఒక్కో కార్మికుడు రూ.లక్ష నష్టపోతు న్నాడ న్నారు. కాంట్రాక్టు కార్మికుల్లో 15 నుంచి 20 ఏళ్లుగా పనిచేస్తున్న వారున్నారన్నారు. ఇప్పటికి ఎలాంటి పదోన్నతులు, గ్రేడ్‌చేంజింగ్ రాలేదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమబాట పట్టక తప్పదని హెచ్చరించారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి అత్యున్నత లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రయత్నం చేయాలని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ విశ్వనాథ కుమార్ పేర్కొ న్నారు. శుక్రవారం యూనివర్శిటీ లో ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫైన్‌ఆర్ట్స్‌లో నాలుగేళ్ల ఆర్కిటెక్చర్‌లో సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పరిజ్ఞానాన్ని పెంచుకుని అత్యున్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రేయస్సే ముఖ్యం : డీఈవో



విద్యార్థి సామర్థ్యాలు తెలుసుకుంట్ను డీఈవో

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి శ్రేయస్సు ముఖ్యమని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ తెలిపారు. శుక్రవారం 20వ వార్డు గాండ్లవీధిలోని ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల నిష్ప త్తి, విద్యార్థులకందిస్తున్న విద్యార్థి కిట్, మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థి సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధాన టీచరు యాస్మిన్ బేగం, సీఎంఆర్‌టీ క్రిష్ణ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూలు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూలులో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో అనురాధ తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుంతో 26 నుంచి 29 లోపు, రూ.500 అపరాధ రుసుంతో ఈనెల 30 నుంచి 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నాబార్డు ఆర్ఐడీఎఫ్ రాయలసీమ జోన్ వర్క్‌షాపు

కడప నాగరాజుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో నాబార్డు ఆర్ఐడీఎఫ్ నిధులతో అమలవుతున్న వివిధ ప్రాజెక్టుల సమీక్ష కడపలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాబార్డు డీజీఎం దిని పనీకర్ మాట్లాడారు. రాయలసీమలో నాబార్డు నిధులతో అమలవుతున్న వివిధ ప్రాజెక్టులు త్వరితగతిన నిర్దేశిత సమయంలోపు అమలుపరిచి కొత్త ప్రాజెక్టులకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. నాబార్డు ఏజీయం అరుణ్, ఖడిలకర ఆర్ఐడీఎఫ్ నిధులపై కూలంకుశంగా వివరించారు.

'ఎత్తిపోతల'కు.. మోక్షం లభించేనా..!

- అర్ధాంతరంగా ఆగిపోయిన వరికుంట్ల చెరువు ఎత్తిపోతల పథకం
- నిలిచిపోయిన కీలకమైన పనులు
- గత ప్రభుత్వ నిర్వాహకమే కారణం అంటున్న స్థానికులు
- కొత్తప్రభుత్వంలోనైనా పనులు సాగేనా..



నిరుపయోగంగా ఉన్న పైపులు



అసంపూర్తిగా ఉన్న సంప్ నిర్మాణం

కాశినాయన అక్టోబరు 18: తెలుగుగంగ ఎడమకాలువ పేరుకే కాశినాయన మండలంలో ప్రవహిస్తోంది కానీ దాదాపు అర్ధ మండలానికి తాగు, సాగునీరు అందని పరిస్థితి. సారవంతమైన భూములు కల్గిన ఇటుకులపాడు మొదలు సావిశెట్టిపల్లె, ఆకులనారాయణపల్లె, నాయనపల్లె, వరికుంట్ల, బాలాయపల్లె, గొంటువారిపల్లె, గంగనపల్లె తదితర గ్రామాలకు తెలుగుంగ జలాలు అందడం లేదు. పైగ్రామాల ప్రజలు గత కొన్నేళ్లుగా మాప్రాంతానికి సాగు తాగునీరు అందించాలని కోరుతున్నా ఫలితం లేదు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి కాలువకు పడమర వైపు ఎగువభాగాన ఉన్న ఈగ్రామాలకు ఎత్తిపోతల ద్వారా నీరందిస్తామని నేతలు హామీలు ఇస్తున్నారే గాని అవి నేటికీ సంపూర్ణ కార్యరూపం దాల్చలేదు.

కాశినాయన మండలంలోని ఇటుకులపాడు వద్ద తెలుగు గంగ ఎడమ కాలువపై గత టీడీపీ పాలన (2014-2019)లో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి ఇటుకలపాడు, సావిశెట్టిపల్లె, వరికుంట్ల తదితర చెరువులకు లింక్ ఛానల్‌ద్వారా నీరందించే ఏర్పాట్లు చేస్తామని నాయకులు ప్రకటించారు. అందుకు అనుగుణంగా పలుమార్లు అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదికలు నాటి ప్రభుత్వానికి పంపారు. ఇంతలో ఎన్నికలు రావడం టీడీపీ అధికారాన్ని కోల్పోయి వైసీపీ అధికారం చేపట్టడం జరిగింది. అనంతరం వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈప్రాంత ప్రజలు ఎత్తిపోతలపై ఎంత మొత్తుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ఈప్రాంత వాసి వరికుంట్ల గ్రామస్తుడైన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిపై ఒత్తిడి పెరగడంతో పాత ప్రతిపాదనలను పక్కనపెట్టి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గంగనపల్లె వద్ద తెలుగంగ కాలువపై ఎత్తిపోతల పథకం అంటూ కొత్త ప్రతిపాదనను తెరమీదకు తెచ్చారు. అనుకున్నదే తడువుగా నాటి ప్రభుత్వం రూ.13 కోట్లతో దాదాపు 8కి.మీ మేర పైప్‌లైన్ ఏర్పాటు చేసి సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి లైన్‌లాగి 550 హార్స్‌పవర్ మోటర్లు రెండింటిని బిగించి నేరుగా వరికుంట్ల చెరువుకు నీరందించే కార్యక్రమానికి టెండరు ఖరారు చేసింది.



ఎత్తిపోతల పథకం పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో జనవరి మొదటి వారంలో ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా ఎత్తిపోతల పథకానికి భూమి పూజ చేయించారు. అయితే ప్రజలు మాత్రం ఇది ఎప్పుడు పూర్తవుతుంది.. ఎన్నికల కోసం హడావుడి చేస్తున్నారంటూ పలువురు విమర్శలు కూడా చేశారు. అనుకున్నట్లే.. గడువు లోగా పనులు పూర్తికాకపోవడం.. ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి.. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగింది. కొత్త ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటినా కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టక పోవడంతో ఎత్తిపోతల పథకం ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల నర్సాపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో బద్వేల్ టీడీపీ సమన్వయకర్త యువనేత కే.రితీష్‌రెడ్డి కూడా ఎత్తిపోతల పథకం పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం కాలువలో నీరు ప్రవహిస్తోందని.. యుద్ధ ప్రాతి పదికన పథకం పూర్తి చేసి చెరువులకు నీరందించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

నిధులు రాగానే పనులు పూర్తి

వరికుంట్ల చెరువు ఎత్తిపోతల పథకం పనులు బిల్లులు రాక పనులు నిలిచిపోయాయి. రూ.13కోట్ల నిధులు మంజూరు కాగా రూ.8కోట్లతో దాదాపు 7.5 కి.మీ పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయి. నిధులు విడుదల కాగానే అసంపూర్తిగా ఉన్న సంప్ నిర్మాణం, కరెంట్ లైన్, మోటార్ల ఏర్పాటు తదితర పనులు చేయిస్తాం.

-రామస్వామి, తెలుగుగంగ డీఈ

అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం : ఎస్పీ



పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యుల సమస్యలు వింటున్న ఎస్పీ

కడప (క్రైం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో వివిధ కారణాలతో మృతి చెందిన పోలీసు అమరవీరుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వపరంగా అందాల్సిన సౌకర్యాలు, అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు, కుటుంబ స్థితిగతులు, బాగోగులను అడిగి తెలుసుకుని.. అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబాల సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని జిల్లా పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్‌లకు సూచించారు. ఆయా కుటుంబాలకు పోలీసుశాఖ ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డీపీవో ఏవో జ్యోతి, సూపరింటెండెంట్లు తులసిరామ్, శ్రీనివాస్‌నాయక్, సురేశ్, ఆర్ఐ టైటాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం

జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు గ్రీవియన్స్‌డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత స్పౌస్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. ఇందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు.

జెన్‌కోలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కోలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేశ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం రారా గ్రంథాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో దాదాపు 2500 పైచిలుకు ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు. ఇందులో అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు 387, జూనియర్ ప్లాంటు అసిస్టెంటు 1761, జూనియర్ అకౌంటు ఆఫీసరు 33, జూనియర్ అసిస్టెంటు 87 ఉద్యోగాలతో పాటు మరికొన్ని ఉద్యోగ ఖాళీగా ఉన్నాయన్నారు. అధికారంలోకి రాగానే ఖాళీలు భర్తీ చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. విద్యుత్ ఉత్పత్తి శాఖలో చాలా ఏళ్లుగా ఉద్యోగాలు భర్తీ చేయలేదని.. తక్షణం భర్తీ చేసి ఆదుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, సంజయ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మర్రిమాకులపల్లెలో పిడుగు



పెండ్లిమర్రి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిమాకులపల్లెలో గురువారం రాత్రి 9గంటల ప్రాంతంలో పిడుగుపడింది. గ్రామంలోని ఆంజనేయులు అనే వ్యక్తి ఇంటి వెనుక ఉన్న వేపచెట్టుపై పడడంతో వేపచెట్టు పైభాగం నుంచి కింది వరకు చీలిపోయింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

గండికోటప్రాజెక్టుకు ఆగిన కృష్ణాజలాలు

కొండాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అవుకు రిజర్వాయిర్ నుంచి గండికోట ప్రాజెక్టుకు వచ్చే కృష్ణా జలాలు ఆగినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. దీంతో గండికోట ప్రాజెక్టు నుంచి దాని అనుబంధ రిజర్వాయిర్లకు ప్రస్తుతం నీటిని నిలుపుదల చేసినట్లు తెలిపారు. మైలవరం జలాశయం, సీబీఆర్, పైడిపాలెం, వామికొండ, సర్వరాయసాగర్ రిజర్వాయర్లకు ప్రస్తుతం నీటిని నిలుపుదల చేశారు. ఈ రిజర్వాయర్లలో తగినంత నీటిమట్టం ఉండడంతో గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని నిలుపుదల చేశారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.22 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సమన్వయంతో పనిచేసినప్పుడే.. పల్లె పండుగ



సిమెంటు రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్పీ సీఈవో

చెన్నూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రతి పల్లెలో అభివృద్ధి పరుగులు పెడుతుందని.. ఇదే పల్లెపండుగకు నిజమైన అర్థమని జడ్పీ సీఈవో ఓబులమ్మ అన్నారు. మండలంలోని కొక్కిరాయపల్లె గ్రామ పంచాయతీలో గురువారం సిమెంటు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ వారోత్సవాల్లో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్న దృఢ సంకల్పంతో కోట్లా ది రూపాయల నిధులు అందించిందని.. సద్వినియోగం అయ్యేలా రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా నేటికీ పలు గ్రామాలు సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి పంచాయతీల సర్పంచ్‌లు, అధికారులు దగ్గరుండి రోడ్ల పనులను నాణ్యతతో చేయించుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ జ్యోతి, ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చింతకుంట వాసుదేవరెడ్డి, జి.సూర్యనారాయణ, ఉపసర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి, గ్రామ సీనియర్ నేత చెన్నూరు రాంప్రసాద్, పీఆర్ ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు మల్లికార్జున, ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైలుకింద పడి మహిళ మృతి



కొండాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొండాపురం రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడి పులిచెర్ల సుజాత(36) అనే మహిళ మృతి చెందింది. రైల్వే పోలీసుల వివరాల మేరకు ఎర్రగుంట్ల మండలం చిలంకూరు వాసి సుజాత హుబ్లీ ఎక్స్‌ప్రెస్(ఇంటర్‌సిటీ రైలు)లో వెళుతూ నీళ్లు తాగడానికి కొండాపురం రైల్వేస్టేషన్ ఒకటో ప్లాట్‌ఫామ్‌లో దిగిం ది. ఈమె రైలు కదులుతుండగా ఎక్కబోయి జారి రైలు కింద పడి మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజా రాంరెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దు టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా ఈమె ఎర్రగుంట్ల నుంచి తాడిపత్రికి వెళుతున్నట్లు తెలిసింది.

22న జాబ్‌మేళా

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి 22వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జింకా అశోక్‌బాబు పేర్కొన్నారు. కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 22వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తామని, ఈ జాబ్ మేళాలకు ఎయిర్‌టెల్, అమరరాజా గ్రూపు, ఇన్నోవ్‌సోర్స్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐఐటీ, డిప్లొమో చదివిన యువత 18 నుంచి 30 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైనవారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేలు వేతనం ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 8886297300 నంబరులో సంప్రదించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఉర్దూ యూనివర్శిటీలో పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు డాక్టర్ అబ్దుల్‌హక్ ఉర్దూ యూనివర్శిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ లోకనాధ్ ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 8341511632, 9959758609 నంబర్లలో సంప్రదించాలన్నరు.

వైన్ షాపు ఏర్పాటులో హైటెన్షన్

- ప్రారంభించిన భూపేష్ వర్గం
- తొలగించాలన్న ఎమ్మెల్యే ఆది వర్గం
- ఎన్డీయేలో వర్గపోరు బహిర్గతం

ముద్దనూరు అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వైన్ షాపు ఏర్పాటులో హైటెన్షన్ నెలకొంది. ముద్దనూరు మండలానికి రెండు మద్యం దుకాణాలు మంజూరు కాగా లాటరీలో ఒకటి భూపేష్‌రెడ్డి వర్గానికి మరొకటి పొట్లదుర్తి సురేష్‌నాయుడు వర్గానికి దక్కింది. దీంతో మద్యం దుకాణాల విషయంలో ఎన్డీయేలో వర్గపోరు నెలకొంది. మూడు రోజులు కావస్తున్నా మద్యం దుకాణాలు ప్రారంభం కాలేదు. మద్యం దుకాణాల ఏర్పాటు విషయంలో మూడు రోజులుగా భూపేష్‌రెడ్డి వర్గం, ఆదినారాయణరెడ్డి వర్గం, సురేష్‌నాయుడు వర్గం మధ్యం చర్చలు జరుగుతూనే ఉన్నాయి. చర్చలు ఫలించనట్లు సమాచారం. శుక్రవారం భూపేష్‌రెడ్డి వర్గానికి చెందిన వారు నాలుగు రోడ్ల కూడలి సమీపంలో మద్యం దుకాణాన్ని ప్రారంభించారు. అయితే ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గానికి చెందిన ఎంపీటీసీ కాంతమ్మ, జడ్పీటీసీ ఉమాదేవి మరి కొందరితో కొత్తగా ప్రారంభించిన మద్యం దుకాణం వద్దకు చేరుకున్నారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఎస్ఐ మైనుద్దీన్‌కు వారు వినతి పత్రం అందించారు. హైవేలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారని.. హైవేకి 200 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండకూడదన్న నిబంధన ఉందన్నారు. వెంటనే మద్యం దుకాణం తొలగించాలని వారు నినాదాలు చేశారు. దీంతో ఆప్రాంతంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. తాత్కాలికంగా మద్యం షాపుమూతవేశారు. దీంతో ముద్దనూరు, ఎర్రగుంట్ల నుంచి వచ్చిన పోలీసులు గుంపును చెల్లాచెదురు చేశారు.





మద్యం దుకాణం ప్రారంభోత్సవం వద్ద పోలీసుల మోహరింపు, మద్యం షాపు తొలగించాలని ఎస్ఐకి వినతి పత్రం అందిస్తున్న ఎంపీటీసీ కాంతమ్మ, జడ్పీటీసీ ఉమాదేవి

పెట్రోలులో నీరు కల్తీ.. వినియోగదారుల ఆందోళన

రైల్వేకోడూరు, అక్టోబరు 18:(ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉన్న ఓ పెట్రోలు బంకులో పెట్రోలుతోపాటు నీరు వస్తున్నట్లు వినియోగదారులు గుర్తించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి, సీపీఐ నాయకులు దార్ల రాజశేఖర్ తదితరులు అక్కడికి చేరుకుని పెట్రోల్ బం కును సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై బంకు యజ మాని మల్లెంకొండు నవీన్‌కుమార్ మాట్లాడుతూ పెట్రోల్ ట్యాంకులో వర్ష పు నీరు కలిసింది వాస్తవమే అని, 6 నుంచి 7 వాహనాలకు పెట్రోల్ పట్టిన తర్వాత విషయం గురించి పెట్రోల్ పట్టడం ఆపేసి పెట్రోల్ కంపెనీ ప్రతి నిధులకు సమాచారం అందించామని తెలిపారు. కర్నూలు నుంచి కంపెనీ వారు వచ్చి సమస్య పరిష్కరించేంత వరకు పెట్రోల్ విక్రయాలు నిలిపివేసినట్లు బంకు వద్ద బోర్డు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

పంచాయతీలు ఆదాయ వనరులపై దృష్టి సారించాలి

లక్కిరెడ్డిపల్లె అక్టోబరు (ఆంధ్రజ్యోతి)18: సొంత ఆదాయ వనరుల పై పంచాయతీలు దృష్టి సారించాలని డీఎల్‌పిఓ లక్ష్మీపతి సూచిం చారు. మండలంలోని గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్ల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు గ్రామాల్లో పారిశు ధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తది తరాలపై గ్రామ పంచాయతీ చొరవ చూపాలన్నారు. సొంత ఆదా య వనరుల కల్పనకు సర్పంచులు, వార్డు మెంబర్లు సహకరించా లన్నారు. ఎంపీడీవో రెడ్డెయ్య, ఈఓపీఆర్‌డీ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు సుదర్శన్ రెడ్డి, నాగమణి, ఇమాంసాబ్, ఎం ఎస్ నవేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు

సంబేపల్లె: పంచాయతీరాజ్ వ్యవస్థలపై సభ్యులకు కనీస అవగాహన ఉండాలని ఎంపీడీవో రామచంద్ర, పంచాయతీరాజ్ ఈవో ఆర్‌డీ సునీల్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో వారు మాట్లాడారు.

పుల్లంపేట: గ్రామాల్లోని ప్రజలకు అవసరమైన మౌలిక వస తులు తప్పనిసరిగా కల్పించాలని ఎంపీడీవో జయశ్రీ సూచించారు.



సంబేపల్లె: సర్పంచులు, వార్డు మెంబర్ల శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్ర

స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఉపసర్పంచులకు, వార్డు మెంబర్లకు పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించారు.

సుండుపల్లె: ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, రాయవరం సర్పంచ్ షరీఫ్, ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ పరిశీలన

నందలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టంగుటూరు సమీపంలోని చెయ్యేరులో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ ను జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు శుక్రవారం రాత్రి పరిశీ లిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ క్వారీ యజమానులతో మాట్లాడుతూ వర్షాలు పడుతుండడం వల్ల నదికి వరద వచ్చే ప్రమాదం ఉందని, అప్రమత్తం గా ఉండాలని సూచించారు. ఈయన వెం ట మన్నారు సీఐ బీవీ రమణ, పోలీసులు పాల్గొన్నారు.

కూటమి హయాంలోనే అభివృద్ధి

ఓబులవారిపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అదికారంలోకి వచ్చినప్పటి నుంచి శరవేగంగా ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడుతున్నారని టీడీపీ యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి తెలిపారు. పల్లెపండుగ కార్య క్రమంలో భాగంగా మండలంలోని బొమ్మవరం, బోటుమీదపల్లె, సీఎం రాచపల్లె గ్రామాల్లో సీసీ రోడ్లు, పాఠశాల భవనం నిర్మాణాలకు భూమిపూజ చేశారు.

రామాపురం: గువ్వలచెరువులో ఎంపీడీవో జాషువా సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈవోపీఆర్‌డీ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరి, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి వయోజన విద్య కేంద్రాలు

సుండుపల్లె, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా నవంబర్ 5నుంచి నిరక్షరాస్యులైన మహిళలకు వయోజన విద్య కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు ఏపీఎం శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్త్రీ శక్తి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 34 అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతిరోజు రెండు గంటల పాటు విద్యను అందిస్తామన్నారు. సీసీలు శంకర్‌నాయక్, ఓబులేసు, సిద్దయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీలకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయం

సుండుపల్లె, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళల మహిళల ఆర్థికాభివృద్ధిలో భాగగా ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు ఏపీఎం శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఆహార పదార్థాలు తయారు చేసే వారికి ఫుడ్ సేఫ్టీ అ థారిటీ సర్టిఫికెట్‌ను కూడా ప్రభుత్వమే అందిస్తున్నట్లు తెలిపారు. ఓఎన్‌డీసీ వెబ్‌సైట్‌లో పేర్లు, వాళ్లు చేసే ఆహారం వివరాలు ఆన్ లైన్‌లో నమోదు చేసుకుని , వివరాలను స్త్రీ శక్తి భవనంలో సీసీల వద్ద నమోదు చేసుకోవచ్చునన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటిటౌన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్క రించాలని కాంట్రాక్టు లెక్చరర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్లు పసుపు రిబ్బన్ తగిలించుకొని తమ సమస్యలను ప్రభుత్వానికి విన్నవించారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారం

వీరబల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మట్లి పంచాయతీ ఆసాదివాండ్లపల్లెలో తాగునీటి సమస్య పరిష్కార మైంది. గ్రామ సర్పంచ్ నాగార్జునాచారి చొరవతో ఇటీవల పం చాయతీ నిధులతో వేసిన బోరుకు మోటారును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ వార్డు మెంబర్ లోకేశ్, గ్రామస్తులు వెంకటేశ్, గంగయ్య, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాజంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మి కుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్య దర్శి చిట్వేలి రవి కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్య లను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏడాది ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించలేదన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శులు బాలకృష్ణ, డి.సుధాకర్ మాట్లాడుతూ కోడూరు సబ్ డివిజన్‌లోని రెడ్డివారిపల్లె, బాలపల్లె ప్రాంతాల్లో సిబ్బందిని నియ మించకుండా 2 సబ్‌స్టేషన్లను ఓపెన్ చేసి పక్క సబ్‌స్టేష్‌లో పని చేసే కార్మికులతో పనిచేయిస్తూ వారిపై ఒత్తిడి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కొత్త సిబ్బందిని నియమింకుంటే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్

రాయచోటిటౌన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): నెంబర్ ప్లేట్‌లు ఉన్న వాహనాలు చోరీకి గురైనపుడు సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించేం దుకు అవకాశం ఉంటుందని, ప్రతి వాహనదారుడు తమ వాహనానికి నెంబర్ ప్లేట్ అమర్చుకోవాలని ట్రాఫిక్ సీఐ విశ్వనాథ రెడ్డి సూచించారు. శుక్రవారం ట్రాఫిక్ పోలీసు సిబ్బందితో కలిసి పట్టణంలో నెంబరు ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పలు వాహనాలు గుర్తించి నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేయించారు. ట్రాఫిక్ ఏఎస్ఐ జోసెఫ్‌తో పాటు సిబ్బంది చంద్రశేఖర్, మనోహర్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకుంటకట్టపై తహసీల్దార్ పరిశీలన

రామాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసిరెడ్డి గారిపల్లె పంచాయతీ సుగాలిబిడికీ సమీపంలో ఉన్న గుండ్లకుంట కట్టను శుక్రవారం తహసీల్దార్ రామాంజనే యులు పరిశీలించారు. కట్టకు రంధ్రం పండిందని రైతులు తహసీల్దార్ దృష్టికి తీసుకు రాగా ఆయన వెంటనే కట్టపైకి వచ్చి కట్టను పరిశీలించారు. ఈ రోజు రాత్రికల్లా చెరువు నిండే అవకాశం ఉండడం తో, కట్ట తెగి పోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కట్ట తెగిపోతే అయకట్టు భూములన్నీ బీళ్లుగా మారు తాయని వారు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై అక్కడే ఉన్న ఎంఐ జేఈ మహబూబ్‌బాషాకు కట్ట మరమ్మతులను చేయించాలని ఆదేశించారు. వీ ఆర్‌వోలు నరసింహులు, రాధిక, ఎంఐజేఈ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

సంబేపల్లె, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఉచిత కంటి వైద్య శిబిరం విజయ వంతమైనట్లు దుద్యాల సర్పంచ్ ఎద్దుల లక్ష్మీదేవి తెలి పారు. శుక్రవారం దుద్యాల గ్రామ సచివాలయంలో రాయచోటికి చెందిన అగర్వాల్ కంటి ఆసు పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా దృష్టి లోపం ఉన్న వారిని గుర్తించి కంటి అద్దాలను అందజేస్తున్న ట్లు తెలిపారు. శస్త్ర చికిత్సకు అర్హులైన వారిని గుర్తించి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా అగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్య బృందానికి సర్పంచ్, ఆమె భర్త ఎద్దుల చిన్నప్ప వెల్ఫేర్ అసిస్టెంట్ సుధీర్ అభినందనలు తెలియజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గాలివీడు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని గాలివీడు సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవమ్మ సూచిం చారు. శుక్రవారం మండల కేంద్రం లోని స్త్రీశక్తి భవన్‌లో అంత ర్జాతీయ మహిళా రైతు దినోత్సవం సందర్భంగా రెడ్స్ సంస్థ ఆధ్వ ర్యంలో రైతు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసి ఆదర్శంగా నిలవాలన్నారు. రెడ్స్ సంస్థ అధ్యక్షులు భానుజా మాట్లాడుతూ ఎ స్హెచ్‌జీల్లో ప్రతి మహిళా చేరి వారి ఆర్థిక, సామాజిక మార్పులు సాధించాలన్నారు. ఎఫ్‌బీవో ద్వారా ఇచ్చే ఐదు రకాల మొక్కలతో ఆరు మాసాల నుండి ఆదాయం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్ర మంలో ఏపీఎం పెద్దరెడ్డెయ్య, రెడ్స్ సంస్థ కోఆర్డినేటర్ రవీంద్ర, స్వామి, భారతి, వెంకటయ్య, యల్లప్ప, ప్రకృతి వ్యవసాయ ఎంటీ రమణ, వెలుగు సిబ్బంది శ్రీనివాసులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పైర్ల పరిశీలన

నందలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీలో అధిక వర్షాలకు దెబ్బతిన్న పైర్లను జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు శ్రీరామకృష్ణమరాజు, సుచిత్ర, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సాయిమహేశ్వరి, వ్యవ సాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త మాధురి శుక్రవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వరికుప్పల మీ ద ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని, రబీలో సాగు చేసే ఆర్ఎన్ఆర్-15,048 రకానికి ఎక్కువ మోతాదులో నత్రజని ఎరువులు వాడరాదని తెలిపారు. ఏవో జి.మల్లికార్జున, వ్యవసాయ సహాయ కురాలు సి.పుష్పాంజలి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో పారిశుధ్య పనులు

పుల్లంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు పడిన కారణంగా అంటువ్యాధులు ప్రబలకుండా పుల్లంపేటలో శుక్రవారం స ర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేప ట్టారు. ఈ సందర్భంగా వీధుల్లో చెత్తా చెదారాన్ని తొల గిం చారు. బ్లీచింగ్, సున్నం చల్లారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ పెంచలయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి సహకరించండి



మైనార్టీ శాఖ మంత్రితో సమావేశమైన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో మైనారిటీలు ఎదు ర్కొంటున్న సమస్యలను రా ష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి విజయవాడలో న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూఖ్ దృష్టికి తీసుకువెళ్లారు. నియోజక వర్గంలో షాదీఖానా ఏర్పాటు చేయాలని, మైనార్టీ విద్యార్థులకు రాయితీలు, మైనార్టీమహిళలు, పిల్లల అభివృద్ధి కోసం, శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పన, ఆర్థిక వెనుకబాటుతనం సమస్యను పరిష్క రించాలని కోరారు.

25న రైల్వేకోడూరులో జాబ్‌మేళా

రైల్వేకోడూరు, అక్టోబరు 18:(ఆంధ్రజ్యోతి) ఈ నెల 25న రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఇండస్ట్రీ కస్టమైజ్‌డ్ స్కిల్ ట్రైనింగ్, ప్లేస్మెంట్స్ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం. భాస్కర్‌రెడ్డి తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల వరకు వయసు, పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఐటీఐ డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులు అని తెలిపారు. యువతీ, యువకులు తమ బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలతో ఉదయం 9 గంటలకు హాజర కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9550095775 సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

గాలివీడు, అక్టోబరు18: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భాగ్యలత హెచ్చరించారు. రెండు రోజుల క్రితం అందిన ఫిర్యాదు మేరకుశుక్రవారం మండలంలోని గాలివీడు, గోరాన్ చెరువు పంచాయతీల్లోని సర్వే నెంబర్ 1465, 900బీ, 890, 1465ఏలలో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించామన్నారు. ఆర్ఐ బాలాజీ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

నేడు రామాలయం వద్ద పోలీసు కవాతు

ఒంటిమిట్ట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయం వద్ద శనివారం తిరుమల ఆక్టోపస్ ఆధ్వర్యంలో పోలీసు కవాతును నిర్వహించనున్నారు. మొట్ట మొదటిసారిగా కోదండరామాలయంలో టీ టీడీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిం చనున్నారు. టీటీడీకి అనుబంధ ఆలయాల్లో ని భక్తులను ప్రమాదాల నుంచి ఎలా రక్షించాలన్న అంశంపై పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహిస్తారని టీటీడీ ఇన్‌చార్జి అధి కారి గంగులయ్య తెలిపారు.

మహిళల అక్రమ రవాణాపై పోస్టర్లు విడుదల

సుండుపల్లె, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): మహిళల అక్రమ రవాణా నేరమని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ దైవాధీనం తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో , మండల ఎంఈవో కార్యాలయాల్లో గుడ్ నైబర్స్ సంస్థ ఆధ్వర్యంలో మహిళల అక్రమ రవాణాపై అవగాహన పోస్టర్లు, టీ షర్టులు విడుదల చేశారు. మహిళలను ఇంటికే పరిమితం చేయకుండా సమాజంలో అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్, గుడ్ నైబర్స్ సంస్థ సభ్యులు నాగేశ్వర తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటించుకుని యువతి ఆత్మహత్యాయత్నం

సుండుపల్లె, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం తాళలేక ఓ యువతి పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. స్థానికుల కథనం మేరకు రెండేళ్ల క్రితం జీవనోపాధి వెతుక్కుంటూ తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌నుంచి లక్ష్మి (24) అనే యువతి ఇక్కడికి వచ్చి మండలంలోని పెద్దినేనికాలువ పంచాయతీ బెస్తపల్లి సమీపంలో నివాసం ఉంటోంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శుక్రవారం పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యా యత్నం చేసింది. విషయం గమనించిన స్థానికులు ఆమెను కడపలోని రిమ్స్‌కు తరలించారు. ఈమెకు భర్త, కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు.

జన్‌ధన్ బీమా చెక్కు అందజేత

పుల్లంపేట, అక్టోబరు 18 : (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఏపీజీబీ ఖాతాదారు తమ్మిరెడ్డి చెంగల్‌రెడ్డి కుటుంబానికి ఆ బ్యాంకు మేనేజరు మూర్తి శ్రీనివాసులు శుక్రవారం రూ. 2 లక్షల విలువైన బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రెడ్డిపల్లె గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి చెంగల్‌రెడ్డి కి తమ బ్యాంకులో ఖాతా ఉందని, ప్రధానమంత్రి జన్‌ధన్ జీవన్ బీమా యోజన పథకం కింద ఏడాదికి 436 రూపాయలు చెల్లించారన్నారు. ఆయన మృతిచెందడంతో మంజూరైన రెండు లక్షల రూపాయల బీమా మొత్తానికి సంబంధించిన చెక్కును మృతుడి భార్య రాణెమ్మకు అందజేశారు. ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకులో ఖాతా కలిగి, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాలు అమలు చేసుకొని ఉండి ఎవరైనా మృతిచెందితే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే ఆ కుటుంబ సభ్యులకు తెలియజేసి బీమా సొమ్ము అందజేస్తామని తెలిపారు.

చెక్కభజనలో రాజా



చెక్కభజన ప్రదర్శన ఇస్తున్న డిస్కో రాజా (ఫైల్)

పోరుమామిళ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చెక్కభజన (కులుకుభజన) అంటే అతనికి ఆరోప్రాణం. ఎక్కడ ఉత్సవాలు జరిగినా, పండుగలు జరిగినా దేవాలయ విగ్రహ ప్రతిష్ఠలు జరిగినా తనదైన శైలిలో కులుకుభజనతో ఆ ప్రాంతవాసులను మంత్రముగ్ధులను చేస్తుంటాడు. మండలవాసులనే కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా తన కళను ప్రదర్శిస్తూ ఎంతో మందికి చెక్క భజనలో శిక్షణ ఇస్తూ రాణిస్తున్నాడు పోరుమామిళ్ల మండలం పుల్లీడు పంచాయతీ పేరమ్మగారిపల్లెకు చెందిన డిస్కోరాజా.

డిస్కోరాజా అంటే జిల్లాలో తెలియనివారు ఉండరు. అయితే ఈయన అసలు పేరు బండ్ల రాజా. ఈయన తల్లిదండ్రులు బాలమ్మ, సుబ్బయ్య. సుబ్బయ్య పండరిభజన కళాకారుడు. రాజా అన్న సుబ్బరాయుడు కూడా పండరిభజన కళాకారుడు. అయితే రాజా ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో వీరి గ్రామంలో బి.మఠానికి చెందిన పుల్లయ్య చెక్కభజన ప్రదర్శించాడు. దానిని చూసినప్పటి నుంచి రాజాకు చెక్కభజనపై ఆసక్తి పెరిగింది. పుల్లయ్య వద్ద తమ గ్రామంలోని మరికొందరు యువకులతో కలసి చెక్కభజన నేర్చుకున్నాడు. తొలిసారిగా తమ కాలేజీలోనే ప్రదర్శన ఇచ్చాడు. ఇక అప్పటి నుంచి వెనుదిరిగి చూడలేదు. ఉన్న ఎకరం పొలంలో సేద్యం చేసుకుంటూ.. చెక్కభజనే వృత్తిగా జీవనం సాగిస్తున్నాడు.

36 ఏళ్లుగా..

బండ్ల రాజా మారుతున్న ప్రజల అభిరుచులకు అనుగుణంగా చెక్కభజన ప్రదర్శించడం మొదలు పెట్టాడు. ఇందులో భాగంగా సినిమా పాటలకు భజన చేయడం, ఆ పాటలకు అనుగుణంగా సినిమాల్లో మాదిరి డ్యాన్సులు కూడా చేయడం మొదలు పెట్టాడు. చెక్కభజనతో పాటు కులుకుభజనలోనూ ప్రావీణ్యం సాధించాడు. దీంతో ఈయన పేరు డిస్కోరాజాగా మారింది. తాను నేర్చుకున్న విద్యను మరింత పదను పెట్టి గ్రూపులుగా తయారు చేసుకుని ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించాడు. దాదాపు 36 ఏళ్ల నుంచి ఈ కళనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. 30 నుంచి 50 మందితో బృందాన్ని తయారు చేసుకుని వివిధ ప్రాంతాల్లో దాదాపు 70 గ్రూపులకు పైగా శిక్షణ ఇచ్చారు.

ఎన్నో ప్రదర్శనలు..

డిస్కో రాజా ప్రదర్శనలు పోరుమామిళ్ల మండలానికే పరిమితం కాలేదు.. జిల్లాతో పాటు కేర్నూలు జిల్లాలోనూ ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. తిరుణాల, పండుగ, వివాహ వేడుకలు, అయ్యప్పస్వామి ఊరేగింపులు, దేవాలయాలు, చర్చిల ఉత్సవాలకు చెక్కభజన నిర్వహిస్తుంటారు. ఎన్నికల సందర్భాల్లో కూడా తన కళ ప్రదర్శించారు. ప్రభుత్వపథకాల్లో భాగంగా అక్షర రశ్మి, మద్యపాన నిషేధం, కడపోత్సవాల్లో పాల్గొని చెక్కభజన ద్వారా ప్రజలకు సందేశమిచ్చారు. బ్రహ్మంగారిమఠం, సిద్ధయ్యమఠం, నర్రవాడ వెంగమాంబ ఉత్సవాల్లో, క్రిష్టంపల్లె జమలయ్య ఉర్సు సందర్భంగా సన్మానాలు అందుకున్నారు. గతంలో రాజంపేటలో జరిగిన అన్నమయ్య ఉత్సవాల్లో వంద మంది చేత చెక్కభజన చేసి అందరి మన్ననలు పొందారు.

చెక్కభజనలో మార్పులు

గతంలో చెక్కభజనలో ప్రజలు పౌరాణిక పాటలు ఆదరించేవారు. అవే కోరుకునేవారు ఇప్పటి తరం సినిమాల్లోలాగా డిస్కో డ్యాన్స్‌లు కోరుకోవడంతో వారి అభిరుచులకు తగ్గట్లు పాటలు పాడుతూ చెక్కభజన చేస్తున్నారు. గతంలో ప్రోగ్రాంలో పాల్గొంటే బృందానికి రూ.50వేలు ఇచ్చేవారు. ప్రస్తుతం రూ.80వేలు ఇస్తున్నా చివరకి తన చేతికి అందేది రూ.2వేలు, 3వేలు మాత్రమే అని డిస్కో రాజా అంటున్నారు. చెక్కభజన సందర్భంగా మైకు టెస్టింగ్‌లకు రూ.20వేలు, డ్యాన్సర్లకు రూ.14వేలు ఇవ్వాల్సి వస్తుందన్నారు. ప్రత్యేకంగా ఉండేందుకు అనంతపురం, నంద్యాల, కర్నూలు, గుత్తి నుంచి చెక్కభజన కార్యక్రమానికి డ్యాన్సర్లను పిలిపించుకోవాల్సి వస్తుందన్నారు. గతంలో నెలకు 3 కార్యక్రమాలు ఉండేవని, కోలాటం వచ్చిన తరువాత తమకు గిరాకీ తగ్గిందన్నారు. వినాయకచవితి, ఉగాది వంటి ఉత్సవాలకు కూడా ప్రోగ్రాంలు ఇచ్చామన్నారు.

కళాకారుల పింఛన్ ఇవ్వాలి

- డిస్కోరాజా, చెక్కభజన (కులుకుభజన) కళాకారుడు



కళాకారునిగా అందరి మన్ననలు, గుర్తింపు పొందినా నాకు కళాకారుల పింఛన్‌మాత్రం రావడం లేదు. కొన్ని జిల్లాల్లో చెక్కభజన కళాకారులకు పింఛన్ అందుతోంది. ఈ జిల్లాలో కళాకారులకు పింఛను అందడంలేదు. మా కళను ప్రభుత్వం గుర్తించి మాలాంటి వారికి పింఛను ఇచ్చి ఆదుకోవాలి. ఉన్న ఒక ఎకరా పొలంతోనే జీవనం సాగిస్తున్నా. పంటలు సరిగా చేతికి రాకపోతే అప్పులు చేయాల్సిందే. నేను 36 ఏళ్లుగా ఈ కళనే నమ్ముకుని ఉన్నా. ఇప్పటికైనా ప్రభుత్వం కళాకారుల పింఛను కేటాయించి ఆదుకోవాలి.

అరటి గెల @ రూ.500



రాజంపేట మండలం కారంపల్లెలో ఉన్న అరటి పంట

- అరటికి రికార్డు ధర
- కిలో రూ.20.. గెల రూ.500
- గిట్టుబాటు ధరలతో రైతుల్లో ఆనందం

(5వ పేజీ తరువాయి..)

సాగు చేయడం.. వచ్చిన లాభాలతో కుటుంబ పోషణ చేసుకోవడం ఈ ప్రాంత ఉద్యానవన రైతులకు ఓ ప్రధాన వనరుగా మారింది. ఎక్కువగా ఈ పంటను బోరుబావుల కిందనే సాగు చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

రాష్ట్రంలోని అనేక పట్టణాలతో పాటు చెన్నై, ముంబై, బెంగుళూరు తదితర రాష్ట్రాలకు కూడా రాజంపేట డివిజన్ నుంచి అరటికాయలను ఎగుమతి చేస్తుంటారు. ప్రతిరోజు ఈ ప్రాంతం నుంచి 20 లారీలకు తక్కువ లేకుండా ఎగుమతి అవుతూ ఉంటాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూలీలు పండిన అరటి తోటల వద్దకు వెళ్లి వాటిని కట్‌చేసి ఒకచోట పోగు చేస్తారు. మధ్యాహ్నానికి ప్రత్యేక లారీల్లో వీటిని ఎంతో జాగ్రత్తగా అమర్చి సాయత్రం వేళ ప్రధాన పట్టణాలకు తీసుకెళతారు.

నదీ పరివాహక ప్రాంతాలైన పెన్నానది, బాహుదానది, చెయ్యేరు, గుంజనేర్ల కింద నీరు సమపాలల్లో లభించే బోరుబావుల కిందనే ఈ పంటను సాగు చేస్తున్నారు. ఏదేమైనా గతేడాది ఇదే సీజన్‌లో కిలో అరటి ధర కేవలం రూ.10 ఉండింది. ఈ ఏడాది అమాంతంగా రూ.20కు చేరడంతో అరటి రైతుల్లో ఆనందాన్ని ఇస్తుంది. 2 నెలల కిందట కిలో అరటి ధర కేవలం రూ.10-12 మధ్య ఉండేది. దీనివల్ల తక్కువ ఆదాయం వచ్చేది. ఏడాది పొడవునా పంట దిగుబడిని ఇచ్చే అరటిపంట ఈ ప్రాంత ఉద్యానవన రైతులకు పెద్దవరంగా మారింది.

రూ.20 ధర ఉండడం ఆనందదాయకం

- నాగా హరి, రైతు, అనంతయ్యాగారిపల్లె, పుల్లంపేట



మాది పుల్లంపేట మండలం అనంతయ్యగారిపల్లె, మేము 10 ఎకరాల్లో అరటి పంటను సాగు చేస్తున్నాం. ప్రస్తుత సీజన్‌లో అరటి కిలో రూ.20 పలకడం ఆనందదాయకం. అయితే ప్రస్తుత సమయంలో అరటికాయలు తక్కువగా ఉండడంతో ధరలు అమాంతం పెరిగాయి. ఇటీవలే అరటి పంట చేతికి రావడం వల్ల వాటిని ఎగుమతి చేశాం. అక్కడక్కడ చేతికి వచ్చిన అరటి పంట వల్ల సంబంధిత రైతులు లాభాలు గడిస్తూ ఆనందపడుతున్నారు. ఇది అరటి పంట రైతులకు శుభపరిణామం.

కాయలు తక్కువగా ఉన్నప్పుడు ధరలు మామూలే

- ఎ.శంకరయ్య, రైతు, గొబ్బూరువారిపల్లె, ఓబులవారిపల్లె



మార్కెట్‌లో కాయలు లేనప్పుడు అతి తక్కువగా లభించే పంటకు వ్యాపారులు ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం అరటి పంట సీజన్ అయిపోయింది. అక్కడక్కడ అరకొరగా కాయలు దిగుబడి అవుతున్నాయి. ఈ అరటికాయలను చెన్నై, గూడూరు, బెంగుళూరు ప్రాంతాలకు ఎగుమతి చేసినప్పుడు వీటికి బాగా డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం కిలో రూ.20 ఉండడం వల్ల పంట చేతికొచ్చిన కొద్దిపాటి అరటి రైతులకు బాగా గిట్టుబాటు లభిస్తుంది.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 470 రెవెన్యూ గ్రామాలకు గానూ ఇప్పటి వరకు 138 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించిందని, ఈ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ గ్రామ సభలు ఈ నెల 18 నుంచి ప్రారంభమై 30 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభల్లో స్వీకరించిన అర్జీలను అధికారులు నిర్ణీత గడువు లోపల పరిష్కరించాలని సూచించారు.

అన్ని సౌకర్యాలతో పనులు చేపట్టండి



గోదామును పరిశీలిస్తున్న జేసీ

తంబళ్లపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మండల స్థాయి సివిల్ సప్లయ్స్ గోదామును అన్ని సౌకర్యాలతో నాణ్యతగా చేపట్టాలని జేసీ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శుక్రవారం తంబళ్లపల్లెలో రూ.69 లక్షల అంచనాతో నిర్మిస్తున్న సివిల్ సప్లయ్స్ గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ డీఎం శివరాం, తహసీల్దారు హరికుమార్, ఆర్ఐ, వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ 78 మంది వీఆర్వోల బదిలీలతో కొత్త జాబితా

కలికిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరో 78 మంది వీఆర్వోలను బదిలీ చేస్తూ శుక్రవారం కొత్త జాబితా విడుదలైంది. అయితే గత నెల 22వ తేదీతో (బదిలీలపై 22 తరువాత నిషేధం వర్తిస్తుంది) ఈ జాబితా రావడం రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా ఉంది. ఇందులో దాదాపు 90 శాతం మంది గతంలో బదిలీ అయిన వారే ఉన్నారు. ఇలా బదిలీ అయిన వారిని తిరిగి వేర్వేరు మండలాలకు, గ్రామాలకు బదిలీ చేస్తూ ప్రస్తుత ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయినా నిషేధం సడలింపు గడువు పూర్తయి దాదాపు నెల రోజులు కావస్తున్నా పాత తేదీతో జాబితాలను ప్రకటించడం విడ్డూరంగా ఉందంటున్నారు, దీనికి తోడు గతంలో బదిలీ అయిన వారినే ఇప్పటికీ రిలీవ్ చేయకుండా ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలనలో నిమగ్నం చేశారు. ఇది పూర్తయితే గానీ బదిలీలకు గురైన వీఆర్వోలు రిలీవ్ అయ్యే అవకాశాలు మాత్రం లేవని చెబుతున్నారు.

గతంలోని రెండు జాబితాలు ఇప్పటికే త్రిశంకు స్వర్గంలో ఉండగా తాజాగా శుక్రవారం మూడో జాబితా రావడం గందరగోళానికి దారి తీసిందని చెబుతున్నారు.

ఆర్టీసీ బస్సు-ద్విచక్ర వాహనం ఢీ

- ఇద్దరు విద్యార్థులు మృతి



మృతిచెందిన యశ్వంత్‌కుమార్‌రెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి

కురబలకోట, అక్టోబరు 18: ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తంబళ్ళపల్లె మండలం గుండ్లపల్లె పంచాయతీ మలిగివారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి కుమారుడు యశ్వంత్‌కుమార్‌రెడ్డి(20), చెట్లవారిపల్లెకు చెందిన సుబ్బారెడ్డి కుమారుడు అజయ్‌కుమార్‌రెడ్డి(20)లు మదనపల్లె పట్టణంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. వారు ఉదయం కళాశాలకు వెళ్లి తిరిగి సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలోని దాదాంవారిపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందారు. కాగా ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయస్థాయి గణితంలో విద్యార్థిని ప్రతిభ



నిమ్మనపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లి మోడల్‌స్కూల్‌లో 10వ తరగతి చదుతున్న విద్యార్థిని శ్రీహాసిని 2024 జాతీయస్థాయి (ఏజీఎమ్ఎన్‌సీ) ఆల్ ఇండియా గర్ల్స్ మ్యాస్ న్యూటర్ క్యాంప్ అనే ఆన్‌లైన్ నేషనల్ పరీక్షకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థిని జాతీయ స్థాయిలో గణితంలో ముందంజలో రావడంతో వారం రోజుల పాటు బెంగళూరులో ఉచితంగా గణితంపై శిక్షణ ఇవ్వడంతో పాటు మూడు నెలల పాటు ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తారని తెలిపారు. మోడల్ స్కూల్ నుంచి శ్రీహాసిని ఎంపిక కావండంపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

చోరీ కేసులో నిందితులకు పదిహేను నెలలు జైలు శిక్ష

గుర్రంకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరు నిందితులకు పదిహేను నెలలు జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని సరిమడుగు పంచాయతీ క్రిష్టాపురానికి చెందిన రమేష్ ద్విచక్ర వాహనాన్ని గత ఏడాది జూన్ 27వ తేదీన చోరీ చేశారు. అప్పట్లో కేసులో నిందితులైన ప్రకాశ్(20), సుబ్బారెడ్డి(31)లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. ఈ కేసులో వాదోపవాదనలు విన్న వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు శుక్రవారం ఇద్దరి నిందితులకు సంవత్సరం మూడు నెలలు జైలు శిక్ష, రూ.1000 జరిమానాను విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

కలకడలో: అలాగే కలకడ మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ మంగళ పల్లెలోని ఓ ఆర్ఎంపీ డాక్టర్ ఇంటి వద్ద ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గత ఏడాది డిసెంబరు 23వ తేదీన చోరీ కేసులో ఇద్దరి నిందితులకు సంవత్సరం మూడు నెలలు జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఈ కేసులో నిందితులైన ప్రకాశ్(20), సుబ్బారెడ్డి(31)లను పోలీసులు పట్టుకున్ని రిమాండు పంపారు. ఈ క్రమంలో వాల్మీకీపురం జూనియర్ సివిల్ కోర్టు నిందితులకు శుక్రవారం సంవత్సరం మూడు నెలలు జైలు శిక్ష, రూ.1000 జరిమానాను విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

రామసముద్రం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. రామసముద్రం-పుంగనూరు రోడ్డులో ఎదురెదురుగా వేగంగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రామసముద్రం మండల కేంద్రానికి చెందిన గంగరాజు అనే వ్యక్తి కాలికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. గంగరాజును స్థానికులు 108 వాహనం ద్వారా పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బోరు బావి తగాదాలో అన్నపై తమ్ముడి దాడి



ఆసుపత్రిలో బాధితుడు పెద్దరెడ్డెప్ప వద్ద నుంచి ఫిర్యాదు తీసుకుంటున్న ఏఎస్ఐ మధుసూదనాచారి

కలికిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బోరు బావిలో అన్నకు భాగం లేదంటూ తమ్ముడు దాడి జరిపిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లూరు పంచాయతీ గల్లావారిపల్లె గ్రామానికి చెందిన జి.పెద్దరెడ్డెప్ప శుక్రవారం ఉదయం తమ ఉమ్మడి భూమిలోని బోరు వద్దకు వెళ్ళాడు. ఆయన తమ్ముడు చిన్న రెడ్డెప్ప బోరులో అయనకు భాగం లేదని వాదనకు దిగాడు. వాదులాట పెరగడంతో తమ్ముడు చిన్న రెడ్డెప్ప కట్టె తీసుకుని అన్న ఎడమ చేయి, ఎడమ కాలుపై కొట్టి గాయపరిచాడు. బాధితుని అరుపులు విన్న చుట్టు పక్కల వారు వచ్చి తమ్ముని బారి నుంచి అన్నను విడిపించారు. కలికిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం అన్న పెద్ద రెడ్డెప్ప పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశాడు. పోలీసు ఇన్‌స్పెక్టర్ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏఎస్ఐ మధుసూదనాచారి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పునుగుపల్లె

ఏం పాపం చేసింది..!

- మూడేళ్లుగా ఉపాధి పనులు లేవు..
- ఉపాధి లేక కూలీల అవస్థలు
- రాజకీయం చేస్తున్నారని కూలీల ఆవేదన



వాల్మీకిపురం సమీపంలోని పునుగుపల్లె గ్రామం

వాల్మీకిపురం, అక్టోబరు 18: వాల్మీకిపురం గ్రామ పంచాయతీలో అది కూడా అత్యంత సమీపంలో జాతీయ రహదారి పక్కగానే పునుగుపల్లె అనే గ్రామం ఉంది. అక్కడ వంద ఇళ్లకు పైగా నివాసాలు ఉంటుండగా అందులో సుమారు వందమంది కూలీలు జీవనంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. కనీసం గ్రామంలో వ్యవసాయం కూడా లేక కూలి జీవనమే గత్యంతరం అయింది. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మూడేళ్లుగా పునుగుపల్లె దరిచేరడం లేదనే చెప్పాలి. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామానికి చెందిన కూలీలు ఒక్కరోజైనా ఉపాధి పనులు చేసిన పాపానపోలేదు. దీంతో చేసేదేమీలేక కూలీలంతా బయటి పనులకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉపాధి అధికారులను మూడేళ్లుగా ప్రాధేయపడుతున్నా పనులు కల్పించడం లేదని, ఎందుకని ప్రశ్నిస్తే మీ గ్రామానికి ఏ పనులు లేవని ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని కూలీలు విచారం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఉపాధి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగితే ఉపాధి పనులకు కూడా రాజకీయ నాయకుల దగ్గరికి వెళ్లాలని చెప్పడంతో పూర్తిగా పనులపై ఆశలు వదులుకున్నామన్నారు. మీ గ్రామానికి ఎలాంటి పనులు లేవని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మూడు సంవత్సరాలుగా గ్రామంలో పనులు లేక బయటి ప్రాంతాలకు వ్యవసాయ పనులు, తాపి మేస్త్రీ, దినసరి కూలీ పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. పునుగుపల్లె గ్రామానికి ఉపాధి అధికారులు కానీ, సిబ్బంది కానీ వచ్చిన దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామ సమీపంలో కొత్త చెరువు ఒకటి ఉందని, సమీపానే ఉన్న కాలువ కూడా ముళ్ల పొదలు పెరిగిపోయి ఆనవాళ్లు కోల్పోతోందని, అధికారులు వచ్చి పరిశీలిస్తే తమకు కరువు పనులకు చింతే ఉండదని విన్నవించుకుంటున్నారు. మూడేళ్ల క్రితం పునుగుపల్లె సమీపంలో ఓ ఇంకుడు గుంత పనులు చేపట్టి అర్థంతరంగా నిలిపివేసి కనీసం చేసిన పనులకు కూలీలు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు పునుగుపల్లెను సందర్శించి ఉపాధి పనులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కంపచెట్లతో నిండిపోయిన పునుగుపల్లె కొత్తచెరువు



పునుగుపల్లెకు చెందిన కూలీలు



పునుగుపల్లెలో సగంలో నిలిపివేసిన ఇంకుడు గుంత పనులు

మూడేళ్లుగా పనులు లేవు..



మా పల్లెలో పోయిన మూడేళ్లుగా కరువు పనులు ఒకటి లేవు. అధికారులని అడిగితే మీ ఊరికి పనులు లేవంటున్నారు. నిరుపేదలు ఎలా బతకాలి.

-మణిరాజ, పునుగుపల్లె

పనులకు బయటకు పోతున్నాం...



మాపల్లెలో పనులు లేక బయటి కూలి పనులకు పోతున్నాం. మా పల్లె ఏం పాపం చేసింది. మాకు కరువు పనులు లేరు. అధికారులు ఎందుకు ఇలా చేస్తున్నారు.

-రుక్మిణమ్మ, పునుగుపల్లె, వాల్మీకిపురం.

రాజకీయం చేస్తారా...



గ్రామంలో కరువు పనులు పెట్టమని అడిగితే రాజకీయ నాయకుల దగ్గరికి పోమంటారు. కూలోళ్ల కరువు పనుల్లో కూడా రాజకీయం చేస్తారా.

-యశోద, కూలి, పునుగుపల్లె, వాల్మీకిపురం

పనులు పెట్టండి సారూ...



పునుగుపల్లెలో ఒకసారి అధికారులు వచ్చి చూస్తే తెలుస్తుంది. మేము పడే కష్టాలు. కరువు పనులు లేక బయటి రోజు కూలీలుగా పోతా ఉంటాము. మాకు కరువు పనులు చూపించాలి.

-ఈశ్వరమ్మ, కూలీ, పునుగుపల్లె

పరిశీలించి పనులు కల్పిస్తాం..

పునుగుపల్లెలో స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారిస్తాం. కూలీల సమస్యలు అడిగి తెలుసుకుంటాం. గ్రామంలో కూలీలందరికీ ఉపాధి పనుల కల్పన దిశగా చర్యలు తీసుకుంటాం. కూలీలు బయటి పనులకు వెళ్లకుండా కరువు పనులు కల్పిస్తాం.

-మనోహర్‌రాజు, ఎంపీడీవో

ట్రిపుల్‌ఐటీ కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా అనిల్



చక్రాయపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రిపుల్‌ఐటీ కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ బొజ్జా అనిల్‌కుమార్‌రెడ్డిని కాంటట్రాక్ట్ అధ్యాపకుల ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. అలాగే వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కోటీశ్వరరావు (ఒంగోలు), ప్రధాన కార్యదర్శి తేజ కిరణ్ (శ్రీకాకుళం), జాయింట్ సెక్రటరీ నిర్మల కుమారి(శ్రీకాకుళం), ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.శివకుమార్ (నూజివీడు)ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కారా నికి పోరాడతామన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులను శాశ్వత అధ్యాపకులుగా నియమించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. అప్పటి వరకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతామన్నారు.

ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతరకు ఆవుల వెంకట్‌కు ఆహ్వానం



వేంపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగుసాహితీ కళాజాతరకు వేంపల్లె జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్ -2లో పనిచేస్తున్న పీజీటి సివిక్స్ అధ్యాపకుడు ఆవుల వెంకట్‌కు ఆహ్వానం అందింది. అంతర్జాతీయ ప్రమాణాలు గల సాహిత్య సాంస్కృతిక, సామాజికసేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా తాడేపల్లె గూడెంలో ఈనెల 19, 20 తేదీల్లో ఏకధాటిగా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ ప్రపంచతెలుగు సాహితీ కళాజాతర కార్యక్రమానికి ఆవుల వెంకట్ పాల్గొననున్నారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తి మండప్రతాప్ ఆధ్వర్యంలో దాదాపు 500 మంది కవులు కళాకారులు, తమ సాహితీ ప్రక్రియలు ప్రదర్శించనున్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఏపీజెన్‌కో ఆర్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.సుబ్బిరెడ్డి మాట్లాడుతూ గ్రేడ్‌చేంజ్, పీఆర్‌సీ అరియర్స్, సర్వీస్ ఇన్సెంటివ్ పురరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు అనేకసార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. 2018లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వంద శాతం జీతాల పెంచడమే కాకుండా అరియర్స్‌తో కలిపి జీతాలిచ్చారన్నారు. విద్యుత్ సంస్థలు కార్మికులకు అరియర్స్ ఇవ్వకపోవడం వల్ల ఒక్కో కార్మికుడు రూ.లక్ష నష్టపోతు న్నాడ న్నారు. కాంట్రాక్టు కార్మికుల్లో 15 నుంచి 20 ఏళ్లుగా పనిచేస్తున్న వారున్నారన్నారు. ఇప్పటికి ఎలాంటి పదోన్నతులు, గ్రేడ్‌చేంజింగ్ రాలేదన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమబాట పట్టక తప్పదని హెచ్చరించారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి అత్యున్నత లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రయత్నం చేయాలని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ విశ్వనాథ కుమార్ పేర్కొ న్నారు. శుక్రవారం యూనివర్శిటీ లో ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫైన్‌ఆర్ట్స్‌లో నాలుగేళ్ల ఆర్కిటెక్చర్‌లో సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పరిజ్ఞానాన్ని పెంచుకుని అత్యున్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రేయస్సే ముఖ్యం : డీఈవో



విద్యార్థి సామర్థ్యాలు తెలుసుకుంటున్న డీఈవో

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి శ్రేయస్సు ముఖ్యమని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ తెలిపారు. శుక్రవారం 20వ వార్డు గాండ్లవీధిలోని ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల నిష్ప త్తి, విద్యార్థులకందిస్తున్న విద్యార్థి కిట్, మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థి సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధాన టీచరు యాస్మిన్ బేగం, సీఎంఆర్‌టీ క్రిష్ణ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూలు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూలులో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో అనురాధ తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుంతో 26 నుంచి 29 లోపు, రూ.500 అపరాధ రుసుంతో ఈనెల 30 నుంచి 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నాబార్డు ఆర్ఐడీఎఫ్ రాయలసీమ జోన్ వర్క్‌షాపు

కడప నాగరాజుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో నాబార్డు ఆర్ఐడీఎఫ్ నిధులతో అమలవుతున్న వివిధ ప్రాజెక్టుల సమీక్ష కడపలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాబార్డు డీజీఎం దిని పనీకర్ మాట్లాడారు. రాయలసీమలో నాబార్డు నిధులతో అమలవుతున్న వివిధ ప్రాజెక్టులు త్వరితగతిన నిర్దేశిత సమయంలోపు అమలుపరిచి కొత్త ప్రాజెక్టులకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. నాబార్డు ఏజీయం అరుణ్, ఖడిలకర ఆర్ఐడీఎఫ్ నిధులపై కూలంకుశంగా వివరించారు.

‘ఎత్తిపోతల’కు.. మోక్షం లభించేనా..!

- అర్ధాంతరంగా ఆగిపోయిన వరికుంట్ల చెరువు ఎత్తిపోతల పథకం
- నిలిచిపోయిన కీలకమైన పనులు
- గత ప్రభుత్వ నిర్వాహకమే కారణం అంటున్న స్థానికులు
- కొత్తప్రభుత్వంలోనైనా పనులు సాగేనా..

కాశినాయన అక్టోబరు 18: తెలుగుగంగ ఎడమకాలువ పేరుకే కాశినాయన మండలంలో ప్రవహిస్తోంది కానీ దాదాపు అర్ధ మండలానికి తాగు, సాగునీరు అందని పరిస్థితి. సారవంతమైన భూములు కలిగిన ఇటుకులపాడు మొదలు సావిశెట్టిపల్లె, ఆకులనారాయణపల్లె, నాయనపల్లె, వరికుంట్ల, బాలాయపల్లె, గొంటువారిపల్లె, గంగనపల్లె తదితర గ్రామాలకు తెలుగుంగ జలాలు అందడం లేదు. పైగ్రామాల ప్రజలు గత కొన్నేళ్లుగా మాప్రాంతానికి సాగు తాగునీరు అందించాలని కోరుతున్నా ఫలితం లేదు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి కాలువకు పడమర వైపు ఎగువభాగాన ఉన్న ఈగ్రామాలకు ఎత్తిపోతల ద్వారా నీరందిస్తామని నేతలు హామీలు ఇస్తున్నారే గాని అవి నేటికీ సంపూర్ణ కార్యరూపం దాల్చలేదు.

కాశినాయన మండలంలోని ఇటుకులపాడు వద్ద తెలుగు గంగ ఎడమ కాలువపై గత టీడీపీ పాలన (2014-2019)లో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి ఇటుకలపాడు, సావిశెట్టిపల్లె, వరికుంట్ల తదితర చెరువులకు లింక్ ఛానల్‌ద్వారా నీరందించే ఏర్పాట్లు చేస్తామని నాయకులు ప్రకటించారు. అందుకు అనుగుణంగా పలుమార్లు అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదికలు నాటి ప్రభుత్వానికి పంపారు. ఇంతలో ఎన్నికలు రావడం టీడీపీ అధికారాన్ని కోల్పోయి వైసీపీ అధికారం చేపట్టడం జరిగింది. అనంతరం వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈప్రాంత ప్రజలు ఎత్తిపోతలపై ఎంత మొత్తుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ఈప్రాంత వాసి వరికుంట్ల గ్రామస్తుడైన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిపై ఒత్తిడి పెరగడంతో పాత ప్రతిపాదనలను పక్కనపెట్టి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గంగనపల్లె వద్ద తెలుగంగ కాలువపై ఎత్తిపోతల పథకం అంటూ కొత్త ప్రతిపాదనను తెరమీదకు తెచ్చారు. అనుకున్నదే తడవుగా నాటి ప్రభుత్వం రూ.13 కోట్లతో దాదాపు 8కి.మీ మేర పైప్‌లైన్ ఏర్పాటు చేసి సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి లైన్‌లాగి 550 హార్స్‌పవర్ మోటర్లు రెండింటిని బిగించి నేరుగా వరికుంట్ల చెరువుకు నీరందించే కార్యక్రమానికి టెండరు ఖరారు చేసింది.



ఎత్తిపోతల పథకం పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో జనవరి మొదటి వారంలో ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా ఎత్తిపోతల పథకానికి భూమి పూజ చేయించారు. అయితే ప్రజలు మాత్రం ఇది ఎప్పుడు పూర్తవుతుంది.. ఎన్నికల కోసం హడావుడి చేస్తున్నారంటూ పలువురు విమర్శలు కూడా చేశారు. అనుకున్నట్టే.. గడువు లోగా పనులు పూర్తి కాకపోవడం.. ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి.. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగింది. కొత్త ప్రభుత్వం వచ్చి వంద రోజులు దాటినా కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టక పోవడంతో ఎత్తిపోతల పథకం ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల నర్సాపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో బద్వేల్ టీడీపీ సమన్వయకర్త యువనేత కే.రితీష్‌రెడ్డి కూడా ఎత్తిపోతల పథకం పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం కాలువలో నీరు ప్రవహిస్తోందని.. యుద్ధ ప్రాతి పదికన పథకం పూర్తి చేసి చెరువులకు నీరందించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

నిధులు రాగానే పనులు పూర్తి

వరికుంట్ల చెరువు ఎత్తిపోతల పథకం పనులు బిల్లులు రాక పనులు నిలిచిపోయాయి. రూ.13కోట్ల నిధులు మంజూరు కాగా రూ.8కోట్లతో దాదాపు 7.5 కి.మీ పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయి. నిధులు విడుదల కాగానే అసంపూర్తిగా ఉన్న సంప్ నిర్మాణం, కరెంట్ లైన్, మోటార్ల ఏర్పాటు తదితర పనులు చేయిస్తాం.

-రామస్వామి, తెలుగుగంగ డీఈ



నిరుపయోగంగా ఉన్న పైపులు



అసంపూర్తిగా ఉన్న సంప్ నిర్మాణం

అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం : ఎస్పీ

కడప (క్రైం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో వివిధ కారణాలతో మృతి చెందిన పోలీసు అమరవీరుల కుటుంబాలను అన్ని విధాల అదుకుంటామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వపరంగా అందాల్సిన సౌకర్యాలు, అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు, కుటుంబ స్థితిగతులు, బాగోగులను అడిగి తెలుసుకుని.. అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబాల సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని జిల్లా పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్‌లకు సూచించారు. ఆయా కుటుంబాలకు పోలీసుశాఖ ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డీపీవో ఏవో జ్యోతి, సూపరింటెండెంట్‌లు తులసిరామ్, శ్రీనివాస్‌నాయక్, సురేశ్, ఆర్ఐ టైటాస్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యుల సమస్యలు వింటున్న ఎస్పీ

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం

జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు గ్రీవియన్స్‌డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత స్పౌస్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. ఇందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు.

సమన్వయంతో పనిచేసినప్పుడే.. పల్లె పండుగ

చెన్నూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రతి పల్లెలో అభివృద్ధి పరుగులు పెడుతుందని.. ఇదే పల్లెపండుగకు నిజమైన అర్థమని జడ్పీ సీఈవో ఓబులమ్మ అన్నారు. మండలంలోని కొక్కిరాయపల్లె గ్రామ పంచాయతీలో గురువారం సిమెంటు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ వారోత్సవాల్లో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్న దృఢ సంకల్పంతో కోట్లా ది రూపాయల నిధులు అందించిందని.. సద్వినియోగం అయ్యేలా రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా నేటికీ పలు గ్రామాలు సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి పంచాయతీల సర్పంచ్‌లు, అధికారులు దగ్గరుండి రోడ్ల పనులను నాణ్యతతో చేయించుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ జ్యోతి, ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చింతకుంట వాసుదేవరెడ్డి, జి.సూర్యనారాయణ, ఉపసర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి, గ్రామ సీనియర్ నేత చెన్నూరు రాంప్రసాద్, పీఆర్ ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు మల్లిఖార్జున, ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



సిమెంటు రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్పీ సీఈవో

ప్రమాదవశాత్తు రైలుకింద పడి మహిళ మృతి



కొండాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొండాపురం రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడి పులిచెర్ల సుజాత(36) అనే మహిళ మృతి చెందింది. రైల్వే పోలీసుల వివరాల మేరకు ఎర్రగుంట్ల మండలం చిలంకూరు వాసి సుజాత హుబ్లీ ఎక్స్‌ప్రెస్(ఇంటర్‌సిటీ రైలు)లో వెళుతూ నీళ్లు తాగడానికి కొండాపురం రైల్వేస్టేషన్ ఒకటో ప్లాట్‌ఫారమ్‌లో దిగిం ది. ఈమె రైలు కదులుతుండగా ఎక్కబోయి జారి రైలు కింద పడి మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రాజా రాంరెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దు టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా ఈమె ఎర్రగుంట్ల నుంచి తాడిపత్రికి వెళుతున్నట్లు తెలిసింది.

22న జాబ్‌మేళా

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి 22వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జింకా అశోక్‌బాబు పేర్కొన్నారు. కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 22వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తామని, ఈ జాబ్ మేళాలకు ఎయిర్‌టెల్, అమరరాజా గ్రూపు, ఇన్నోవ్‌సోర్స్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో చదివిన యువత 18 నుంచి 30 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైనవారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేలు వేతనం ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 8886297300 నంబరులో సంప్రదించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఉర్దూ యూనివర్శిటీలో పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు డాక్టర్ అబ్దుల్‌హక్ ఉర్దూ యూనివర్శిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ లోకనాథ్ ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 8341511632, 9959758609 నంబర్లలో సంప్రదించాలన్నరు.

జెన్‌కోలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కోలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేశ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం రారా గ్రంథాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో దాదాపు 2500 పైచిలుకు ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు. ఇందులో అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు 387, జూనియర్ ప్లాంటు అసిస్టెంటు 1761, జూనియర్ అకౌంటు ఆఫీసరు 33, జూనియర్ అసిస్టెంటు 87 ఉద్యోగాలతో పాటు మరికొన్ని ఉద్యోగ ఖాళీగా ఉన్నాయన్నారు. అధికారంలోకి రాగానే ఖాళీలు భర్తీ చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. విద్యుత్ ఉత్పత్తి శాఖలో చాలా ఏళ్లుగా ఉద్యోగాలు భర్తీ చేయలేదని.. తక్షణం భర్తీ చేసి ఆదుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, సంజయ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

గండికోటప్రాజెక్టుకు ఆగిన కృష్ణాజలాలు

కొండాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అవుకు రిజర్వాయిర్ నుంచి గండికోట ప్రాజెక్టుకు వచ్చే కృష్ణా జలాలు ఆగినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. దీంతో గండికోట ప్రాజెక్టు నుంచి దాని అనుబంధ రిజర్వాయిర్లకు ప్రస్తుతం నీటిని నిలుపుదల చేసినట్లు తెలిపారు. మైలవరం జలాశయం, సీబీఆర్, పైడిపాలెం, వామికొండ, సర్వరాయసాగర్ రిజర్వాయర్లకు ప్రస్తుతం నీటిని నిలుపుదల చేశారు. ఈ రిజర్వాయర్లలో తగినంత నీటిమట్టం ఉండడంతో గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని నిలుపుదల చేశారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.22 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రికల్ దుకాణం దగ్ధం



రాయచోటిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఠాణా సమీపంలో ఉన్న అజంతా ఎలక్ట్రిక్ షాపులో శుక్రవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. యజమానులు నమాజుకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు 40 లక్షలకు పైగా విలువైన ఎలక్ట్రికల్ ఉపకరణాలు కాలిపోయాయని బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే దుకాణంలోని వస్తువులన్నీ కాలి బూడిద అయ్యాయి. దీనిపై తమకు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని అర్బన్ పోలీసులు తెలిపారు.

వైన్ షాపు ఏర్పాటులో హైటెన్షన్

- ప్రారంభించిన భూపేష్ వర్గం
- తొలగించాలన్న ఎమ్మెల్యే ఆది వర్గం
- ఎన్డీయేలో వర్గపోరు బహిర్గతం

ముద్దనూరు అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వైన్ షాపు ఏర్పాటులో హైటెన్షన్ నెలకొంది. ముద్దనూరు మండలానికి రెండు మద్యం దుకాణాలు మంజూరు కాగా లాటరీలో ఒకటి భూపేష్‌రెడ్డి వర్గానికి మరొకటి పోట్లదుర్తి సురేష్‌నాయుడు వర్గానికి దక్కింది. దీంతో మద్యం దుకాణాల విషయంలో ఎన్డీయేలో వర్గపోరు నెలకొంది. మూడు రోజులు కావస్తున్నా మద్యం దుకాణాలు ప్రారంభం కాలేదు. మద్యం దుకాణాల ఏర్పాటు విషయంలో మూడు రోజులుగా భూపేష్‌రెడ్డి వర్గం, ఆదినారాయణరెడ్డి వర్గం, సురేష్‌నాయుడు వర్గం మద్యం చర్చలు జరుగుతూనే ఉన్నాయి. చర్చలు ఫలించనట్లు సమాచారం. శుక్రవారం భూపేష్‌రెడ్డి వర్గానికి చెందిన వారు నాలుగు రోడ్ల కూడలి సమీపంలో మద్యం దుకాణాన్ని ప్రారంభించారు. అయితే ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వర్గానికి చెందిన ఎంపీటీసీ కాంతమ్మ, జడ్పీటీసీ ఉమాదేవి మరి కొందరితో కొత్తగా ప్రారంభించిన మద్యం దుకాణం వద్దకు చేరుకున్నారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఎస్ఐ మైనుద్దీన్‌కు వారు వినతి పత్రం అందించారు. హైవేలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారని.. హైవేకి 200 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండకూడదన్న నిబంధన ఉందన్నారు. వెంటనే మద్యం దుకాణం తొలగించాలని వారు నినాదాలు చేశారు. దీంతో ఆప్రాంతంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. తాత్కాలికంగా మద్యం షాపుమూతవేశారు. దీంతో ముద్దనూరు, ఎర్రగుంట్ల నుంచి వచ్చిన పోలీసులు గుంపును చెల్లాచెదురు చేశారు.





మద్యం దుకాణం ప్రారంభోత్సవం వద్ద పోలీసుల మోహరింపు, మద్యం షాపు తొలగించాలని ఎస్ఐకి వినతి పత్రం అందిస్తున్న ఎంపీటీసీ కాంతమ్మ, జడ్పీటీసీ ఉమాదేవి

తంబళ్లపల్లెలో విద్యుత్ సిబ్బంది కొరత

● ఇబ్బంది పడుతున్న వినియోగదారులు, రైతులు



తంబళ్లపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలో గ్రామాలకు సరిపడా విద్యుత్ శాఖ సిబ్బంది లేకపోవడంతో విద్యుత్ సమస్యలు సకాలంలో పరిష్కారం కాక వినియోగదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తంబళ్లపల్లె మండలంలో 21 పంచాయతీలు ఉండగా తంబళ్లపల్లె, కన్నెమడుగు, గోపిదిన్నె, కోసువారిపల్లె, కుక్కరాజుపల్లెల్లో 33/11 కేవి విద్యుత్ ఉపకేంద్రాలు ఉన్నాయి. ఈ ఉపకేంద్రాల పరిధిలో తంబళ్లపల్లె, కన్నెమడుగు, రేణుమాకులపల్లె, కుక్కరాజుపల్లె, కోటకొండ, గుండ్లపల్లె, దిగువపాళ్యం, గంగిరెడ్డిపల్లె, పంచాలమర్రి, గోపిదిన్నె, కొటాల, జుంజురపెంట కోసువారిపల్లె డిస్ట్రిబ్యూషన్లు ఉన్నాయి. వాటికి లైన్‌మెన్లు, ఏఎల్ఎం (అసిస్టెంట్ లైన్‌మెన్)లు, జేఎల్ఎం (జూనియర్ లైన్‌మెన్)లు కలిపి మొత్తం 13 మందికి పైగా విద్యుత్ సిబ్బంది అవసరం. అయితే తంబళ్లపల్లె టౌన్, రేణుమాకులపల్లె, కోటకొండ, కుక్కరాజుపల్లె, కోసువారిపల్లెకు ముగ్గురు (ఇద్దరు గ్రేడ్-2), గోపిదిన్నెకు(గ్రేడ్-2) మాత్రమే సిబ్బంది ఉన్నారు. కన్నెమడుగు, పంచాలమర్రి, గుండ్లపల్లె, తంబళ్లపల్లె రూరల్, కొటాల డిస్ట్రిబ్యూషన్లకు సిబ్బంది లేరు. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు వస్తే ఎవరికి చెప్పాలో తెలియక వినియోగదారులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. సిబ్బంది లేని గ్రామాల్లో సమస్యలు తలెత్తితే ఇతర గ్రామాల లైన్‌మెన్లు కానీ, విద్యుత్ ఉప కేంద్రాల డ్యూటీ ఆపరేటర్లు వెళ్లి సమస్యను పునరుద్ధరించాల్సి వస్తోంది. దీంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర జాప్యం కలుగుతోంది. ముఖ్యంగా తంబళ్లపల్లె టౌన్, రూరల్‌కు కలిపి ఒక లైన్‌మెన్, ఒక ఏఎల్ఎం, ఒక జేఎల్ఎం ఉండాల్సి ఉండగా.. ఒక లైన్‌మెన్ మాత్రమే ఉన్నారు. దీంతో తంబళ్లపల్లె టౌన్, రూరల్‌లో విద్యుత్ లైన్లలో సమస్యలు వచ్చినపుడు సిబ్బంది ఒక్కరే ఉండటంతో పునరుద్ధరించడంలో ఆలస్యం అవుతోంది. విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి మండలానికి అవసరమైన సిబ్బందిని కేటాయించాలని వినియోగదారులు, రైతులు కోరుతున్నారు.

సకాలంలో సమస్యలను పరిష్కరిస్తున్నాం

- ట్రాన్స్‌కో ఏఈ, శేషు. తంబళ్లపల్లె

తంబళ్లపల్లె మండలంలో సిబ్బందిలేని గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తితే వినియోగదారులకు ఇబ్బంది కలుగకుండా అందుబాటులో ఉన్న లైన్‌మెన్లతో సమస్యలను సకాలంలో పరిష్కరిస్తున్నాం. మండలంలో ఏయే గ్రామాలకు సిబ్బంది అవసరమో ఉన్నతాధికారులకు తెలియచేశాం. త్వరలో జరిగే బదిలీలలో తంబళ్లపల్లె మండలానికి పూర్తి స్థాయిలో సిబ్బంది వస్తారు.

టమోటా పంటలో జాగ్రత్తలు తీసుకోవాలి



టమోటా పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి సుకుమార్ రెడ్డి

పీలేరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా టమోటాతోపాటు ఇతర ఉద్యాన పంటల సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పీలేరు మండల ఉద్యాన శాఖాధికారి సుకుమార్‌రెడ్డి తెలిపారు. పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీలోని చిన్నగాండ్లపల్లె, పెద్దగాండ్లపల్లెల్లోని ఉద్యాన పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ నీరు నిలబడిన టమోటా తోటలలో నీరు తొలగించడమే కాకుండా పొలం త్వరగా ఆరేటట్లు చూడాలన్నారు. వాతావరణంలో అధిక తేమ ఉండడం వల్ల పంటను ఆకుమచ్చ తెగులు ఆశిస్తుందని, దాని నివారణకు లీటరు నీటికి కార్బన్డిజం ఒక గ్రాము లేక మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు పిచికారి చేయాలన్నారు. ఇతర కూరగాయల పంటలపై నారుకుళ్లు తెగులు ఆశించకుండా లీటరు నీటికి కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు కలిపి మొదలు తడిచేటట్లు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో కాకులారంపల్లె వీహెచ్ఏ తిరుమల, పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

గుర్రంకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ పట్టణంలో పారిశుధ్యం లోపించకుండా కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధచూపాలని డీపీవో బాలకృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పలు వీధుల్లో పర్యటించి పారిశుధ్యాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది పారిశుధ్యాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. వర్షాకాలంలో ప్రజలు రోగాల భారీన పడకుండా తగు జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామసముద్రంలో పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలించి సూచనలిస్తున్న ఎంపీడీవో

రామసముద్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):మండలంలో పారిశుధ్య పనులను ఎంపీడీవో భానుప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వీధి కాలువలలో నిలిచిన మురుగునీరు తొలగించి బ్లీచింగ్ చల్లి శుభ్రపరచాలని, పిచ్చిమొక్కలు తొలగించాలని పంచాయతీ అధికారులకు ఆదేశించారు. మండలంలోని పెద్దకురప్పల్లె, చెంబకూరు ఎస్సీ కాలనీలో జరుగుతున్న పారిశుధ్య పనులు ఎంపీడీవో శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా కొందరు ఇళ్ల సమీపంలో చెత్త దిబ్బలు వేసి ఉండగా వాటిని వెంటనే తొలగించాలని, అలాగే చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ఇంటి యజమానులకు, సిబ్బందికి సూచించారు.

కురబలకోటలో యువకుడు దారుణహత్య

కురబలకోట, అక్టోబరు 18: కురబలకోట సమీపంలో యువకుడు హత్యగురైన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలో జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కురబలకోటకు చెందిన ఖాదర్‌బాషా(25)అనే యువకుడు చింతపండు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇతడిని గ్రామ సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. కాగా యువకుడి హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ములకలచెరువు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం ములకలచెరువులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు...మండలంలోని సోంపల్లె పంచాయతీ గట్టుకిందపల్లెకు చెందిన శంకరప్ప(54) సొంత పనుల నిమిత్తం ములకలచెరువుకు వచ్చి బస్టాండు సమీపంలో రోడ్డు దాటుతుండగా కదిరి నుంచి తిరుపతికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకరప్ప తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ మండల సర్వసభ్య సమావేశం వాయిదా

కురబలకోట, అక్టోబరు 18: కురబలకోట మండల సర్వసభ్య సమావేశం ముచ్చటగా మూడో సారీ వాయిదా పడింది. శుక్రవారం సమావేశం నిర్వహించడానికి చర్యలు చేపట్టడంతో ఈ సమావేశానికి మళ్లీ ఆటంకాలు ఎదురయ్యాయి. సభ్యులు హాజరు కాకపోవడంతో ఎంపీడీవో గంగయ్య సమావేశాన్ని వాయిదా వేశారు.

ప్రతి గ్రామం ఆదర్శం చంద్రబాబు ధ్యేయం

వాల్మీకిపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి గ్రామం ఆదర్శంగా తీర్చిదిద్దడమే సీఎం నారా చంద్రబాబునాయుడు ధ్యేయమని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఆసాదివారిపల్లె, గొల్లపల్లెలలో కూటమి పార్టీ నాయకులు ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సీసీ రోడ్లకు భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నరేంద్రకుమార్‌రెడ్డి, నాయకులు వల్లిగట్ల వెంకటరమణ, కోనూరి చంద్రమౌళి, ఆరమడక సూరి, రాజారెడ్డి, గోవిందు, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపల్లె మండలం, కొత్తపల్లె పంచాయతీ, ఎనుమలవారిపల్లెకు చెందిన బాలిక గత నెల 29నుంచి కనపడకపోవడంతో కుటుంబ సభ్యులు తమ బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. ఆచూకి తెలియకపోవడంతో బాలిక తల్లి కవిత శుక్రవారం తాలుకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్ బాధ్యతగా చేయండి



ఫ్రీహోల్డ్ ల్యాండ్ రికార్డులనుపరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

పెద్దమండ్యం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఫ్రీహోల్డ్ ల్యాండ్ వెరిఫికేషన్‌ను బాధ్యతగా చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. పెద్దమండ్యం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్, వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలో ఫ్రీహోల్డ్ ల్యాండ్ రికార్డుల వెరిఫికేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఫ్రీహోల్డ్ రికార్డులను జాయింట్ కలెక్టర్‌కు అందజేసి వివరాలను తెలియజేశారు. మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఫ్రీహోల్డ్‌లో న్న భూమి వివరాల రికార్డులను పరిశీలించారు. తప్పులు లేని రికార్డులను సిద్ధం చేయాలన్నారు. మండల సర్వేయర్ హసీన్‌తాజ్, మండల ఆర్ఐ రమేష్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో కొండయ్య

పీలేరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తలపుల పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం పీలేరు పట్టణం ఆర్టీసీ నల్లగుట్టలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ప్రతికూల వాతావరణ మార్పుల దృష్ట్యా ఇంటిలోని ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగడం, తాజా ఆహారం భుజించడం, తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం, పరిసరాల పరిశుభ్రత పాటించడం చేయాలన్నారు. అనంతరం ఆ ప్రాంతంలో దోమలు, లార్వా నివారణ మందుల పిచికారిని పరిశీలించారు. కార్యక్రమంలో తలపుల వైద్యాధికారి రమేశ్‌రెడ్డి, మలేరియా సబ్-యూనిట్ అధికారి విద్యాసాగర్, హెచ్ఈ కొండయ్య, సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, కుసుమ, సీహెచ్‌వో ఆయేషా, ఆశాలు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

కలకడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల భారీన పడకుండా తగు ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆసుపత్రి పరిధిలోని ముడియంవారిపల్లె గ్రామస్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వాతావరణ ప్రభావంతో జ్వరాలు ప్రబలే అవకాశముందన్నారు. ప్రజలు దోమల నివారణకు తగు జాగ్రత్తలు పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఎఫ్‌పీవో నూతన కమిటీ నియామకం

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట ఉమ్మడి మండలాలకు చెందిన గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం నూతన కమిటీని ఏపీఎం హరి సమక్షంలో ఎన్నుకున్నారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ 17 మందిలో ఓబీలుగా ఐదుగురు ఎన్నుకుని వారికి బాధ్యతలు అప్పగించారు. సంఘ సభ్యులు, లీడర్ల సమావేశం నిర్వహించి ఏకగ్రీవంగా ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్(ఎఫ్‌పీవో) అధ్యక్షుడిగా మల్లారి నాగరాజును ఎన్నుకున్నారు. బి.కొత్తకోట మండలానికి చెందిన ప్రధాన కార్యదర్శి పద్మావతమ్మ, ఉపాధ్యక్షుడిగా రమేష్, ఉప కార్యదర్శిగా లక్ష్మీదేవి, కోశాధికారిగా హరీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఎగువపల్లె రామచంద్ర, పట్నా చంద్రమోహన్‌రెడ్డి, తుమ్మరకుంట గంగిరెడ్డి, అంజి పాల్గొన్నారు.

22న పీలేరులో మినీ జాబ్ మేళా

పీలేరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న మినీ జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్, జిల్లా ఉపాధి కార్యాలయం వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, యంగ్ ఇండియా, టాటా క్యాపిటల్ సంస్థలు పాల్గొంటాయని ఆయన తెలియజేశారు. 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉన్న ఎస్ఎస్‌సీ నుంచి పీజీ వరకు చదువుకున్న వారు జాబ్‌లో పాల్గొనవచ్చని, ఎంపికైన అభ్యర్థులకు రూ.10 నుంచి రూ.20 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. జాబ్ మేళా 22వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు 966086996, 8897776368 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ కేసులో పదిమందిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల ఘర్షణ సంఘటనపై పదిమందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. మదనపల్లెకు చెందిన ఇరువర్గాలు పాతకక్షలతో గొడవపడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో గాయపడిన వర్గం బుధవారం రాత్రి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స చేయించుకొంటున్నట్లు తెలుసుకున్న మరో వర్గం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో దూరి డాక్టర్ల సమక్షంలోని మళ్లీ గొడవపడి కొట్టుకున్నట్లు తెలిపారు. దీంతో అక్కడే అవుట్‌పోస్టు పోలీసుగా విధులు నిర్వహిస్తున్న భాస్కర్ నాయక్ ఫిర్యాదు మేరకు విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి, సెక్యూరిటీపై దౌర్జన్యం, ఉద్యోగుల విధుల అటంకం కలిగించారని, రోగులు భయాందోళనకు గురైయ్యారనే కారణంతో శుక్రవారం బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌తోపాటు పదిమందిపై కేసు నమోదు టూటౌన్ పోలీసులు చేశారు. ఇందులో ఇరువర్గాలకు చెందిన రేణుక, రమణమ్మ, రవి, శశి, సంధ్య, శివమ్మ, నాగమణి, అరుణ్, గంగులమ్మ వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

కలకడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఇంటర్, టెన్త్ చదువుతున్న విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన కలకడ ఆదర్శ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించడానికి పీఎంసీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు కాగా పాఠశాల మధ్యాహ్న భోజనానికి ప్రతి రోజు 20 లీటర్ల పెరుగును ఉచితంగా ఇస్తున్న దాతలను అభినందించారు. పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా బాలికల హాస్టల్ భవనాన్ని పరిశీలించి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఎంఈవో మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు



అలంకరణలో గంగమ్మ

మదనపల్లె అర్బన్, అక్టోబర్ 18: (ఆంధ్రజ్యోతి) కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవారం ఆలయకమిటీ ప్రత్యేక అలంకరణలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకుడు సుష్మిత్ పుష్పాలతో అలంకరణ చేసి అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మకు చీర, జాకెట్లు, పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రంగస్వామినాయుడు, కరుణాకర్‌నాయుడు, మార్పూరి విక్కీ, మార్పూరిమహేష్, దేవేంద్ర, శ్రీనివాసులు నాయుడు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వాల్మీకిపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలంలో శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, విద్యుత్ లైన్ల మరమ్మతుల విషయమై విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వాల్మీకిపురం ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలియజేశారు. ఈ విద్యుత్ అంతరాయం పట్ల ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే ఏవైనా విద్యుత్ సమస్యలు ఉంటే ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో సమాచారం అందించి సహాయం పొందవచ్చన్నారు.

పీటీయం పోలీస్‌స్టేషన్ తనిఖీ

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పీటీయం పోలీస్టేషన్‌ను మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు శుక్రవారం ములకలచెరువు సీఐ రాజా రమేష్‌తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. స్టేషన్‌లో ఉన్న పలు రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పలు కేసుల వివరాలను స్థానిక ఎస్ఐ నరసింహులును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. మండల సరిహద్దుగా ఉన్న గ్రామాలపై పోలీసులు నిఘా ఉంచాలని, మండలంలో అక్రమ ఇసుక, అసాంఘిక కార్యక్రమాలు, గ్రామాల్లో పేకాట వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచి అటువంటి వాటిపై కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి ఘర్షణలు చెలరేగకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టి శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏ పార్టీకి చెందిన వారైనా తప్పు చేసి పోలీస్టేషన్‌కు వస్తే రాజకీయాలతో ముడిపెట్టకుండా నాయకులు కూడా పోలీసులకు సహకారాన్ని అందించాలని ఆయన కోరారు.

కబడ్డీలో విద్యార్థిని ఉత్తమ ప్రతిభ

పీలేరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని జి.హేమశ్రీ రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నీలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పీలేరులోని మహాత్మా జ్యోతీరావు పూలే బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.రాధారాణి తెలిపారు. మంగళగిరి కబడ్డీ లీగ్-2024 పేరిట ఈ నెల 9 నుంచి 12వ వరకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో చిత్తూరు జిల్లా జట్టు మూడవ స్థానంలో నిలిచి కప్పుతోపాటు రూ.50 వేల నగదు బహుమతి గెలుచుకుందన్నారు. ఆ జట్టులో తమ విద్యార్థిని జి.హేమశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచి జట్టును గెలిపించడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. ఈ మేరకు హేమశ్రీ, ఆమెకు శిక్షణ ఇచ్చిన పీటీఈ అమరావతిని శుక్రవారం పాఠశాలలలోని బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్ని సౌకర్యాలతో రైతుబజార్ సిద్ధం



రైతుబజార్‌లో రైతులతో చర్చిస్తున్న మార్కెటింగ్‌శాఖ ఏడీఎం త్యాగరాజు

మదనపల్లె టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులకు అన్ని సౌకర్యాలతో రైతు బజార్ సిద్ధం చేశామని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఏడీఎం త్యాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రైతు బజార్‌ను పరిశీలించిన ఏడీఎం పలువురు రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజార్‌లో రైతులు ఉత్పత్తులు విక్రయించుకునేలా స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి గల రైతులు వారి భూమి పాసుపుస్తకాల జిరాక్స్, లేదా కౌలు రైతుల సర్టిఫికెట్లతో తమకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తులు తీసుకొచ్చి రైతుబజార్‌లో విక్రయించేవారికి ఎలాంటి గేటు రుసుం, దళారుల కమిషన్ ఉండవన్నారు. ఈ విషయమై జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో మదనపల్లె చుట్టుపక్కల అన్ని గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి ఈశ్వర్‌రెడ్డి, ప్రకృతివనం ప్రసాద్, కంగేరి నంద, రైతులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు మండీలు నిర్వహించుకోవాలి



మార్కెట్ కమిటీ కార్యాలయంలో మండీ యజమానులకు సూచనలిస్తున్న కార్యదర్శి అభిలాష్

మదనపల్లె టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోటా యార్డులో మండీ యజమానులు నిబంధనల మేరకు వ్యాపారాలు నిర్వహించాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి అభిలాష్ సూచించారు. శుక్రవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో మండీ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రటరి మాట్లాడుతూ మార్కెటింగ్ చట్ట ప్రకారం టమోటా మండీలలో జాక్‌పాట్ విధానం రద్దు చేశామన్నారు. దీన్ని అనుసరించుకుని మండీ యజమానులు వేలం పాటలు నిర్వహించాలన్నారు. యార్డులో లైసెన్స్ పొందిన మండీ యజమానులు వారికి కేటాయించిన స్థలంలోనే షెడ్లు వేసుకోవాలని, ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. టమోటా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెపెట్టకుండా మండీలను నిర్వహించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మండీ యజమానులు పాల్గొన్నారు.

నిధులు విడుదలకు సహకరించండి

●సీఎంను కోరిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీలో సాధారణ నిధులు విడుదలకు సంబంధించి తమకు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే ఎం.నవాజ్ బాషా సీఎం చంద్రబాబునాయుడు కోరారు. మంగళగిరిలో పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ లు, ఇన్‌చార్జిలు, ముఖ్యనేతలతో సీఎం సమీ క్షించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మె ల్యే..మున్సిపాలిటీలో నిధుల వినియోగంపై సీఎఫ్ఎం ఎస్ సమస్యను అధినేత దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపాలిటీలో నిధులు ఉన్నా..సకాలంలో వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అభివృద్ధి పనులతోపాటు పాలనాపరమైన సమస్యలు ఎదురవుతున్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తమకు రిలాక్సేషన్ కల్పించి మున్సిపల్ నిధులు విడుదల, వినియోగానికి సహకరించాలని కోరగా, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు షాజహాన్‌బాషా వివరించారు.

టీడీపీ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు



సమావేశంలో పాల్గొన్న కిశోర్‌కుమార్ రెడ్డి



హాజరైన టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు/కలికిరి,అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని కేంద్ర పార్టీ కార్యాల యంలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చం ద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన టీడీపీ సమావేశానికి ఎమ్మెల్యేలు, టీడీపీ ఇన్‌చార్జ్ లు పాల్గొన్నారు. ఇందులో భాగంగా పార్టీ సమావేశానికి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. అలాగే తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి హాజరయ్యారు. టీడీపీ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో జరిగి న సమా వేశానికి హాజరు కావాలని పార్టీ అధి ష్టానం నుంచి పిలుపు రావడంతో వారు మంగ ళగిరికి వెళ్లి సమావేశంలో పాల్గొన్నారు.

మండల ప్రజా పరిషత్‌లో బదిలీలు

కలికిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బదిలీలు కొనసాగుతున్నాయి. ఇక్కడ ఈవోఆర్డీగా పనిచేస్తున్న పీవీ పరశురామ్ చిత్తూరుకు బదిలీ అయ్యారు. ఆయనకు బదులుగా మొహ్మద్ రియాజుద్దీన్‌ను నియమించారు. గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ ఏఈగా పనిచేస్తున్న కృష్ణారెడ్డిని ఎర్రావారిపల్లె మండలానికి బదిలీ చేయగా ఆయనకు బదులుగా వేణుగోపాల్‌రెడ్డిని నియమించారు. చిత్తూరు జడ్పీ కార్యాలయంలో పనిచేస్తున్న సురేంద్రబాబును ఇక్కడ ఏవోగా నియమించారు.

మెడికల్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్ చూపకపోవడం దారుణం

మదనపల్లె అర్బన్, అక్టోబరు19: ఏపీ రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ మెడికల్ కళాశాల కౌన్సెలింగ్‌లో మదనపల్లె మెడికల్ కళాశాల ఆప్షన్ చూపించకపోవడం దారుణమని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిందెల గౌతమ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కమిషన్‌కు మదనపల్లె మెడికల్ కళాశాలను పూర్తి చేసి ప్రారంభించడానికి తమ వద్ద సరిపడ నిధులులేవని రాష్ట్ర ప్రభుత్వం చేతులు ఎత్తివేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో అనేక చోట్ల మెడికల్ కళాశాల ప్రారంభమై ఒక ఏడాది పూర్తి చేసుకున్నాయని గుర్తు చేశారు. గత ఏడాది కౌన్సెలింగ్ ద్వారానే ప్రొఫెసర్లు, స్టాఫ్ మదనపల్లె మెడికల్ కళాశాలకు ఎంపిక చేశారని ఈ ఏడాది కౌన్సెలింగ్‌లో మాత్రం స్థానం ఇవ్వకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. నేషనల్ మెడికల్ కమిషన్ నుంచి గుర్తింపు తీసుకొచ్చి తరగతులను ప్రారంభించాలని లేని పక్షంలో అందరినీ కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రమణ, ఉదయ్, గంగాధర్, లక్ష్మీపతి, సంధ్య, శివప్రసాద్, మహేష్, ప్రశాంత్, ఆనంద్, చేతన్ పాల్గొన్నారు..

పాఠశాలల ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



పీలేరులో ఆయాలతో కలిసి మాట్లాడుతున్న సాంబశివ

పీలేరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆయాలకు నెలకు కేవలం రూ.6 వేల వేతనం చెల్లిస్తున్న ప్రభుత్వం, దానిని కూడా సక్రమంగా చెల్లించడం లేదన్నారు. గత నాలుగు నెలల జీతం పెండింగ్‌లో ఉండడం శోచనీయమన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకుని వారి వేతనాన్ని పెంచడమే కాకుండా వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పీలేరు కార్యదర్శి నరసింహులు, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, ఆయాల యూనియన్ నాయకురాళ్లు యశోదమ్మ, శ్రీలక్ష్మి, వెంకటరత్నమ్మ, నీలావతి, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుపై అభ్యంతరాలు తెలుపొచ్చు



ఆర్బీకేల వద్ద రైతుల జాబితాను ప్రచురిస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ సీజన్-2024లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను సంబంధిత ఆర్బీకేలలో ప్రచురించామని ఇందులో ఏవైనా అభ్యంతరాలుంటే తెలుపొచ్చని ఏవో మురళిమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సామాజిక తనిఖీలో భాగంగా 12 ఆర్బీకేలలో రైతులు పండించిన పంటల వివరాల జాబితాను పొందుపరచామని రైతులు జాబితా పరిశీలించి ఏవైనా వ్యత్యాసాలు ఉంటే సంబంధిత వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలన్నారు. రైతులకు అందించే ప్రభుత్వ పథకాలు ఈ-క్రాప్ ద్వారానే నమోదు చేస్తారనిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యసాయ సహాయకులు నాయక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.